# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను




సంపుటి : 2 సంచిక : 217 బుధవారం 14 ఫిబ్రవరి 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# జంపుల సీజన్ షురూ

- పార్టీలు,కండువాలు.. మార్చేయ్
- ఓవైపు బీజేపీ నుంచి ఆహ్వానాలు
- 20 నుంచి 25మంది టచ్‌లో ఉన్నారంటూ కాంగ్రెస్ నేతల కామెంట్లు
- ఇవన్నీ వెరసి బీఆర్ఎస్‌లో జంపింగ్ జపాంగ్ ఎపిసోడ్ నడుస్తోంది
- అధికారం దక్కించుకుని దూకుడుమీదున్న కాంగ్రెస్ పార్టీ.. తెరవెనుక ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టినట్టు తెలుస్తోంది.

ప్రభుత్వం మారి రెండు నెలలు అయిందో లేదో.. అప్పుడే జంపుల సీజన్ షురూ ఐనట్టుంది. ఓవైపు బీజేపీ నుంచి ఆహ్వానాలు. 20 నుంచి 25మంది టచ్‌లో ఉన్నారంటూ కాంగ్రెస్ నేతల కామెంట్లు. ఇవన్నీ వెరసి బీఆర్ఎస్‌లో జంపింగ్ జపాంగ్ ఎపిసోడ్ నడుస్తోంది.



-3లో

## మళ్లీ సెంటిమెంట్ వైపు
# తెలంగాణ రాజకీయాలు



హైదరాబాద్

తెలంగాణలో రాజకీయాలు మళ్లీ సెంటిమెంట్ వైపు నడుస్తున్నట్లున్నాయి. శాసనసభలో కృష్ణా జలాల వాటాకు సంబంధించి, ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డుకు అప్పగించే అంశంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల మధ్య జరిగిన వాగ్యుద్ధం చూస్తే గాలిలో కత్తులు తిప్పుతున్నట్లుగా కనిపించింది. ఇరుపక్షాలు ఒకదానిపై మరొకటి అప్పర్ హ్యాండ్ అవడానికి గట్టి ప్రయత్నమే చేశాయి. వీరిద్దరు కాకుండా భారతీయ జనతా పార్టీ, ఎమ్ఐఎమ్‌లు కొంత ప్రాక్టికల్‌గా మాట్లాడారు. సీపీఐ మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు మద్దతుగా బీఆర్ఎస్ పై పరోక్ష విమర్శలు చేశారు. క్రమంలో రాయలసీమకు నీటిని పెద్ద ఎత్తున తీసుకువెళ్లడానికి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిమో హన్‌రెడ్డి చేస్తున్న కృషిని ఏపీలోని ప్రతిపక్ష తెలుగుదేశం గుర్తించకపోయినా, తెలంగాణ రాజకీయ పక్షాలు అకనాలెడ్జ్ చేసినట్లు అనిపిస్తుంది. వాస్తవం ఏమిటంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృధాగా పోతున్న కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. అలాగే ఏపీకి రావాల్సిన నీటి వాటాను పూర్తి స్థాయిలో తీసుకోవడానికి గాను రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను తలపెట్టారు. కాని కొందరు ఎన్‌జీటీకి వెళ్లి నిలుపుదల చేయించారు. ఇందులో ఏపీలో విపక్ష తెలుగుదేశం పరోక్ష పాత్ర ఉందన్న ఆరోపణలు లేకపోలేదు. ఈ అంశాన్ని పక్కనబెడితే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా నదిపై ఉన్న శ్రీశైలం, సాగర్ తదితర -మిగతా3లో



# కనీస మద్దతు ధరకు చట్టబద్ధత

- స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పిస్తాం
- ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించడం చారిత్రక నిర్ణయం
- 15 కోట్ల మంది రైతుల జీవితాలను ఇది మార్చేస్తుంది
- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక హామీ

## మేడిగడ్డ అద్భుతాలను
# వివరించండి

- కేసీఆర్ కు నేను విజ్ఞప్తి చేస్తున్నా
- మేడిగడ్డకు కేసీఆర్ వస్తానంటే హెలికాప్టర్ సిద్ధం: సీఎం రేవంత్
- మేడిగడ్డ పర్యటనకు కేసీఆర్‌ను కూడా ఆహ్వానించాం
- కేసీఆరే ముందుండి ఈ ప్రాజెక్ట్ గురించి వివరిస్తే బాగుంటుంది.
- బస్సుల్లో రావడం ఇబ్బందైతే హెలికాప్టర్‌లో రావచ్చు.
- కేసీఆర్ కోసం హెలికాప్టర్ కూడా సిద్ధం చేస్తాం



హైదరాబాద్

తెలంగాణ సస్యశ్యామలం చేసేందుకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాటి ప్రభుత్వం, రూ.38,500 కోట్లతో 2008 లో టెండర్లు పిలిచింది. వెంకటస్వామి సూచనతో ప్రాణహితకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టారు. రీడిజైన్ పేరుతో బీఆరెస్ ప్రభుత్వం ప్రాజెక్టు డిజైన్ మార్చి అంచనాలు పెంచింది. రూ.1లక్ష 47 వేల కోట్లకు అంచనాలు పెంచారు. ఇసుక కదిలితే బ్యారేజ్ కూలింది అని వాళ్లు చెబుతున్నారు. వాళ్లు ఇసుకలో పేక మేడలు కట్టారా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇండియా పాకిస్తాన్ బార్డర్ లా ప్రాజెక్టు వద్ద పహారా పెట్టారు. ఎవరినీ చూడకుండా అడ్డుకున్నారని అన్నారు. కొంత మంది అధికారులు ఫైళ్ళు మాయంచేసినట్లు మీడియాలో కథనాలు -మిగతా3లో



# వెంటపడుతం.. వేటాడుతం

## కాంగ్రెస్ సర్కారుకు కేసీఆర్ హెచ్చరిక

- ఇది ఉద్యమ సభ, పోరాట సభ..ఇది రాజకీయ సభ కాదు
- నీళ్లు లేకపోతే మనకు బతుకులేదు
- పక్షిలా తీరుక్కుంటూ రాష్ట్ర మొత్తానికి చెబుతూనే ఉన్నా
- నీరు లేకపోతే తెలంగాణ లేదు
- ఫ్లోరైడ్ సమస్యను ఎవరూ పట్టించుకోలేదు

నల్గొండ

చలో నల్గొండ సభ.. ఉద్యమ సభ, పోరాట సభ.. రాజకీయ సభ కాదని మాజీ సీఎం కే. చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. కృష్ణా నీళ్ల మీద మన హక్కు అనేది.. మనందరి బతుకులకు చావో రేవో తేల్చే సమస్య అని పేర్కొన్నారు కృష్ణా నది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన 'చలో నల్లగొండ' బహిరంగ సభలో మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగిస్తూ.. ఈ రోజు నల్గొండలో 'చలో నల్గొండ' కార్యక్రమం చేపట్టాం. కారణం ఏంటి? ఎందుకు ఈ సభ పెట్టాల్సి వచ్చింది. నాకు కాలు విరిగినా ఎందుకు రావాల్సి వచ్చానో? తెలుసుకోవాలని అన్నారు. -మిగతా3లో

## సీఎం మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన
# పొలిటికల్ డ్రామానే

హనుమకొండ జిల్లా:



సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన ఒక పొలిటికల్ డ్రామా అని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం హనుమకొండ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ఈనెల 20వ తేదీ నుంచి తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రపంచంలో ముందుకు దూసుకెళ్తున్నామని తెలిపారు. 4.5 కోట్ల మంది పేదలకు కేంద్ర ప్రభుత్వం ఇళ్లను కట్టించి ఇచ్చిందని తెలిపారు. మోదీకి దేశ వ్యాప్తంగా అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. -మిగతా3లో

# రైతన్నల ఢిల్లీ ఛలో.. ఢిల్లీ సరిహద్దులో యుద్ధవాతావరణం

**ఢిల్లీ:** రైతుల ఢిల్లీ ఛలో యాత్రతో నగర సరిహద్దులో యుద్ధవాతావరణం నెలకొంది. ముట్టడికి బయల్దేరిన రైతు సంఘాలను అడ్డుకునేందుకు పోలీసులు తీవ్రంగా యత్నిస్తున్నారు. ఈ క్రమంలో సంభూ సరిహద్దులో అడ్డగించే క్రమంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారుల్ని అదుపు చేసేందుకు రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగించారు పోలీసులు. డ్రోన్ ద్వారా టియర్ గ్యాస్ ప్రయోగించిన దృశ్యాలు చక్కర్లు కొడుతున్నాయి. టియర్ గ్యాస్ ప్రయోగంతో చెల్లాచెదురైన నిరసనకారులు.. అంబాల హైవే పైకి చేరారు. మరోవైపు.. పంజాబ్, హర్యానాల నుంచి నిరసనకారులు ఢిల్లీ వైపు వచ్చే యత్నం చేస్తేఉన్నారు. ఇంకోపక్క రైతన్నల ఢిల్లీ ఛలో ప్రభావంతో.. నగరంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. రహదారుల దగ్గర పోలీసుల మోహరింపు.. తనిఖీలతో.. వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. అతినిదానంగా వాహనాలు కదులుతుండడంతో.. కిలో మీటర్ దూరం దాటేందుకు గంటల సమయం పడుతోందని వాహదనదారులు సోషల్ మీడియాలో వాపోతున్నారు. రైతుల మెగా మార్చ్‌ను భగ్నం చేసేందుకు.. ఢిల్లీకి దారి తీసే ప్రధాన సరిహద్దుల వద్ద భారీగా పోలీసులు మోహరించారు. సిమెంట్ దిమ్మెలు, కంచెలతో అడ్డుకునే యత్నం చేస్తున్నారు. సింగూ, టిక్రిలతో పాటు ఢిల్లీ(ఘజియాబాద్), యూపీ నొయిడాల సరిహద్దు ప్రాంతాలైన ఘాజిపూర్, చిల్లా వద్ద పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. అయితే పోలీసులు మాత్రం దారుల్ని పూర్తిగా మూసేయలేదని.. ఫెన్సింగ్‌లో పాక్షికంగా మూసేసి తనిఖీల అనంతరం అనుమతిస్తున్నామని చెబుతున్నారు.

అలాగే అత్యవసరాల వస్తువులను సైతం అనుమతిస్తున్నట్లు చెబుతున్నారు. కానీ, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాలు మాత్రం ఘోరంగా ఉన్నాయి. ఎన్‌హెచ్ 48పై కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ఆందోళనకు తరలివస్తున్న రైతుల్ని పంజాబ్ పోలీసులు అనుమతిస్తుండడం గమనార్హం.

ఇదిలా ఉంటే.. పలు డిమాండ్ల సాధన కోసం ఢిల్లీ ఛలోను ప్రారంభించారు. మంగళవారం ఉదయం పంజాబ్, హర్యానా ఇలా సమీప ప్రాంతాల నుంచి యాత్రను ప్రారంభించారు. అయితే ముందుగానే అప్రమత్తమైన పోలీసులు.. సరిహద్దుల్లో కంచెలతో భారీగా మోహరించారు. దీంతో ఏం జరగనుందా? అనే ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

కేంద్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలమవడంతో.. ముందుగానే నిర్ణయించినట్లు 'ఢిల్లీ చలో' పేరుతో భారీస్థాయిలో ఆందోళన చేపట్టేందుకు రైతులు కదిలారు. పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో రైతన్నలు ఇప్పటికే దేశ రాజధాని దిశగా కదిలారు. మరోవైపుభగ్నం చేసేందుకు పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

సోమవారం నాడు.. యాత్రను విరమించుకోవాలని సూచించిన కేంద్రం.. రైతుసంఘాల నాయకులతో చండీగఢ్ వేదికగా సోమవారం దాదాపు అర్ధరాత్రి వరకూ చర్చలు కొనసాగించింది. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండాల నేతృత్వంలోని ప్రభుత్వ బృందం.. రైతుల ప్రతినిధులుగా వచ్చిన ఎస్‌కేఎం (రాజకీయేతర) నేత





జగ్జీత్‌సింగ్ డల్లేవాల్, కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ప్రధాన కార్యదర్శి సర్వన్‌సింగ్ పంధేర్ తదితరులతో సమాలోచనలు జరిపింది.

**డిమాండ్లు ఏంటంటే..**

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు భరోసా కల్పించేలా చట్టం చేయడం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, పంటరుణాల మాఫీ, రైతులు-రైతుకూలీలకు పింఛన్లు ఇవ్వడం,

మూడు వ్యవసాయ చట్టాలకు (తర్వాత రద్దయ్యాయి) వ్యతిరేకంగా 2020-21లో ఉద్యమించినప్పుడు రైతులపై పెట్టిన కేసుల ఉపసంహరణ వంటి డిమాండ్లపై ఈ భేటీలో విస్తృతంగా చర్చ నడిచింది. వీటిలో.. 2020-21 నాటి కేసుల ఉపసంహరణకు కేంద్ర బృందం అంగీకరించింది. నాటి ఆందోళనల సమయంలో మరణించిన అన్నదాతల కుటుంబాల్లో ఇంకా ఎవరికైనా పరిహారం దక్కకుండా ఉండిఉంటే.. వారికీ పరిహారం అందించేందుకు సమ్మతించింది. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాల్సిందేనని రైతు నాయకులు ప్రధానంగా డిమాండ్ చేశారు. దానిపై ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఢిల్లీ మార్చ్ యథాతథంగా కొనసాగనున్నట్లు కేంద్ర మంత్రులతో భేటీ అనంతరం సర్వన్‌సింగ్ పంధేర్ ప్రకటించారు. మరోవైపు రైతు నాయకులతో కేంద్రం ఈ నెల 8న కూడా చర్చలు జరిపిన సంగతి తెలిసిందే.


**ఆంక్షల వలయంలో హస్తిన**

రైతులను అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా నివారించేందుకు నగరంలో సోమవారం నుంచి నెల పాటు సెక్షన్-144 విధిస్తూ దిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోడా ఉత్తర్వులు జారీ చేశారు. రైతుల నిరసనను సంఘ విద్రోహశక్తులు తమకు అనుకూలంగా మలుచుకునే ముప్పుందని అందులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాభద్రతను దృష్టిలో పెట్టుకొని ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. పెళ్లిళ్లు, అంతిమయాత్రలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**కేంద్రానికి రాకేశ్ టికాయత్ హెచ్చరిక**

రైతుల 'ఢిల్లీ ఛలో' యాత్రతో ఢిల్లీ నగర సరిహద్దులో యుద్ధ వాతావరణం నెలకొంది. ఢిల్లీ ముట్టడికి బయల్దేరిన రైతు సంఘాలను అడ్డుకునేందుకు పోలీసులు తీవ్రంగా యత్నిస్తున్నారు. సింగు బోర్డర్ వద్దకు భారీగా రైతులు చేరుకున్నారు. ఉద్రిక్తతలు చోటు చేసుకోవటంతో రైతులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. టియర్ గ్యాస్ ప్రయోగంతో నిరనసన కారులు చెల్లాచెదురయ్యారు. శంభు బోర్డర్ వద్ద హైటెన్షన్ నెలకొంది. దీంతో రైతులు.. పోలీసులపై రాళ్లు రువ్వారు. ఈ క్రమంలో భారత్ కిసాన్ యూనియన్ (బీకేయూ) నేత రాకేశ్ టికాయత్ బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల వేళ రైతుల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం సమస్యగా సృష్టిస్తే ఊరుకోమని అన్నారు. పలు రైతుల సంఘాలు భిన్నమైన సమస్యలపై పోరాటం చేస్తాయని తెలిపారు. కానీ, నేడు(మంగళవారం) చేపట్టిన రైతుల 'ఢిల్లీ ఛలో' మార్చ్‌ను సమస్యగా చిత్రీకరిస్తే ఊరుకోమని మండిపడ్డారు. తాము రైతులకు దూరంగా లేమని.. నిరసన తెలిపే రైతులకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని గుర్తుచేశారు. అదేవిధంగా రాకేశ్ టికాయత్ సోదరుడు నరేష్ టికాయత్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లపై చర్చ జరపాలని అన్నారు. దేశవ్యాప్తంగా రైతుల నిరసనలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతులతో చర్చలు జరపి అంతేవిధంగా రైతులకు గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఆలోచించి రైతుల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రయత్నించాలని కోరారు. ఇక.. రైతుల డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా 'భారత్ బంద్' నిర్వహించాలని రాకేష్ టికాయత్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. భారత్ కిసాన్ యూనియన్(బీకేయూ) దేశంలోని అతిపెద్ద రైతు సమాఖ్యలలో ఒకటి. నేడు ప్రారంభమైన 'ఢిల్లీ ఛలో' రైతుల ఆందోళనలో అది చేరితే.. కేంద్రం ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని రైతు నిరసనకారుల్లో చర్చజరుగుతోంది.

## అమెరికాలో ఫ్లూతో 15 వేలమంది మృతి!



అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో గల సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం, ఈ సీజన్‌లో ఇప్పటివరకు అమెరికాలో సుమారు రెండు లక్షల 50 వేల మంది ఫ్లూ కారణంగా ఆసుపత్రి పాలయ్యారు 15 వేల మరణాలు సంభవించాయి. ఫిబ్రవరిలో ఇన్‌ఫ్లుయెంజా బారినపడిన చిన్నారుల మరణాలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో మొత్తం 74 మంది చిన్నారులు ఇన్‌ఫ్లుయెంజాతో ఆసుపత్రిలో చేరారు. గడిచిన వారంలో 11 వేలకు పైగా భాధితులు ఆసుపత్రిలో చేరినట్లు పలు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇన్‌ఫ్లుఎంజా వైరస్ వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత తరుణంలో ఆరు నెలలలోపు చిన్నారులకు వార్షిక ఫ్లూ వ్యాక్సిన్ వేయించాలని అధికారులు తెలిపారు.

## 'యూఎన్' ఏజెన్సీపై ఇజ్రాయెల్ ఆగ్రహం.. సంచలన ఆదేశాలు



**జెరూసలెం:** గాజాలో శరణార్థుల కోసం పనిచేస్తున్న ఐక్యరాజ్యసమితి(యూఎన్) ఏజెన్సీ 'యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ'పై ఇజ్రాయెల్ చర్యలు చేపట్టింది. తమ భూభాగంలోని ఏజెన్సీ కార్యాలయాలను వెంటనే మూసేయాలని ఇజ్రాయెల్ గృహనిర్మాణ శాఖ మంత్రి తాజగా ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వానికి ఆ సంస్థతో ఉన్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయనున్నట్లు, భవిష్యత్తులో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి వీల్లేదని ఆదేశాల్లో తెలిపారు. దీంతో ఇజ్రాయెల్‌లో యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ ఇప్పటికే వాడుతున్న, లీజుకు తీసుకుని కార్యకలాపాలు మొదలు పెట్టని ప్రదేశాలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. హమాస్‌కు యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏకు మధ్య ఎప్పటినుంచో సంబంధాలున్నాయని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్(ఐడీఎఫ్) ఆరోపిస్తుండటమే ఈ చర్యలకు కారణమైనట్లు తెలుస్తోంది. యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏకు చెందిన కొందరు ఉద్యోగులు గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన దాడిలో పాల్గొన్నట్లు ఆధారాలు ఇజ్రాయెల్ సైన్యానికి లభించాయి. ఓ మహిళ కిడ్నాప్‌లోనూ వీరి హస్తం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఏజెన్సీ వారిని విధుల నుంచి తొలగించింది.

## లోక్ సభలో నోరు మెదపని ఎంపీలు వీరే..



దేశంలోని ఓటర్లు తమ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తారని ఎంపీలను పార్లమెంట్‌కు పంపిస్తారు. అయితే దీనికి విరుద్ధంగా ప్రవర్తించిన ఎంపీలు కూడా ఉన్నారు. ఎంపీల ఐదేళ్ల పదవీకాలం ముగియనుండడంతో త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. 17వ లోక్‌సభలో వివిధ పార్టీలకు చెందిన తొమ్మిది మంది ఎంపీలు తమ పదవీ కాలంలో ఒక్కసారి కూడా సభలో మాట్లాడనేలేదు. లోక్‌సభ సెక్రటేరియట్ నుండి అందిన సమాచారం ప్రకారం ఈ ఎంపీలలో అమితమైన ప్రజాదరణ పొందినవారు కూడా ఉన్నారు. సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన సన్నీ డియోల్, శతృఘ్న సిన్హా సభలో ఒక్కమాట కూడా మాట్లాడలేదు. మరోవైపు పార్లమెంటు కార్యకలాపాల్లో పాల్గొనని నేతల వర్గంలో శత్రుఘ్న సిన్హా చేరారు. శత్రుఘ్న సిన్హా ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లోని అసన్సోల్ నియోజకవర్గానికి చెందిన ఎంపీ. గతంలో శత్రుఘ్న సిన్హా పట్నా సాహిబ్ లోక్‌సభ స్థానానికి ఎంపీగా ఉన్నారు. బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ పార్లమెంటులో ఒక్కసారి కూడా ఎటువంటి అంశాన్ని లేవనెత్తలేదు. అదేవిధంగా కర్ణాటకలోని బీజాపూర్ స్థానానికి చెందిన బీజేపీ ఎంపి రమేష్ చంద్రప్ప జిగజినాగి కూడా ఎప్పుడూ సభలో మాట్లాడలేదు. ఉత్తరప్రదేశ్‌లోని ఘోసీ నియోజకవర్గం ఎంపీ అతుల్ రాయ్ కూడా ఈ జాబితాలోనే ఉన్నారు.

## బీజేపీలో చేరిన అశోక్ చవాన్.. స్వాగతించిన ఫడ్నవిస్




**ముంబై:** కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్ బీజేపీలో చేరారు. ముంబైలో ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సమక్షంలో మంగళవారం ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా చవాన్‌ను ఫడ్నవిస్ పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ ఊహించినట్లుగానే కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మరుసటి రోజే బీజేపీలో చేరిన చవాన్‌ను కాషాయ పార్టీ రాజ్యసభకు నామినేట్ చేయడం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది. రాజ్యసభ ఎన్నికలకు ఈ నెల 15 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు.

## మేం అందరికీ చికిత్స అందిస్తున్నాం..

### మీరు అందరూ చావాలని కోరుకున్నారు: నితీశ్‌కుమార్



బీహార్ అసెంబ్లీలో ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ప్రసంగిస్తుండగా విపక్ష పార్టీల సభ్యులు 'నితీశ్‌కుమార్ ముర్దాబాద్' అంటూ నినాదాలు చేశారు. సీఎం ప్రసంగాన్ని అడుగడుగునా అడ్డుకున్నారు. అయినా సీఎం తన ప్రసంగాన్ని కొనసాగిస్తుండటంతో 'నితీశ్ ముర్దాబాద్, నితీశ్ ముర్దాబాద్' అంటూ పెద్ద పెట్టున నినదించారు. దాంతో నితీశ్ కుమార్ అసహనానికి గురయ్యారు. 'ఆ నితీశ్ కుమార్ ముర్దాబాద్.. అప్ సబ్‌లోగ్ జిందాబాద్' అని వ్యాఖ్యానించారు. 'మేం ప్రతి ఒక్కరికి వైద్య సదుపాయాల ద్వారా చికిత్స అందిస్తున్నాం. అందుకే నితీశ్ కుమార్ ముర్దాబాద్' అని వ్యంగ్యంతో కూడిన కోపంతో అన్నారు. 'మీ హయాంలో మీరు ప్రతి ఒక్కరూ చావాలని కోరుకున్నారు' అని ఆగ్రహంగా మాట్లాడారు. కాగా, నితీశ్‌కుమార్ ఈ టర్మ్‌లో మొత్తం మూడు సార్లు సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా ఎన్డీఏ కూటమి తరఫున సీఎంగా పనిచేసిన నితీశ్.. అనంతరం బీజేపీతో విభేదించి ఎన్డీఏ కూటమిని వీడారు. ఆ తర్వాత మహా కూటమి తరఫున రెండో సారి సీఎంగా ప్రమాణం చేశారు. ఇటీవల కాంగ్రెస్‌తో విభేదించి మహాకూటమితో తెగదెంపులు చేసుకున్నారు. ఆ తర్వాత మళ్లీ ఎన్డీఏ కూటమిలో చేరి మూడో సారి సీఎంగా ప్రమాణం చేశారు. అనంతరం గవర్నర్ ఆదేశాల మేరకు సోమవారం (నిన్న) అసెంబ్లీలో బలం నిరూపించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ అసెంబ్లీలో నితీశ్ మాట్లాడుతుండగా విపక్ష ఆర్జేడీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల సభ్యులు అడ్డుకున్నారు.

# కనీస మద్దతు ధరకు చట్టబద్ధత

డిమాండ్ల సాధనకు రైతులు ఛలో ఢిల్లీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ గెలుపొంది పాలనా పగ్గాలు చేపడితే రైతులందరికీ తమ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పిస్తూ చట్టపరమైన భద్రత కల్పిస్తామని రాహుల్ భరోసా ఇచ్చారు. స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించారు. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించడం చారిత్రక నిర్ణయమని 15 కోట్ల మంది రైతుల జీవితాలను ఇది మార్చేస్తుందని, వారి సౌభాగ్యానికి దారితీస్తుందని రాహుల్ పేర్కొన్నారు. న్యాయం చేసే దిశగా ఇది కాంగ్రెస్ తొలి గ్యారంటీ అని ఆయన వివరించారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా రాహుల్ ఈ హామీ ఇచ్చారు. కాగా, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం ఉద్రిక్తతలకు దారి తీసింది. 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో భాగంగా పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని



శంభు బార్డర్‌కు రైతులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ముందుగా పోలీసులు వచ్చినవాళ్లను వచ్చినట్టే అరెస్ట్ చేసి స్టేషన్‌లకు తరలించారు. కానీ, కాసేపటికే రైతుల సంఖ్య పెద్ద ఎత్తున పెరగడంతో అరెస్టులు సాధ్యం కాలేదు. వారిని చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించారు. దాంతో ఆందోళనకారులు తలోదిక్కు పరుగులు తీశారు. అక్కడి పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది.

# దేశంలోనే టాప్ కంపెనీలు.. తెలుగు రాష్ట్రాల్లో ఇవి..

భారత్‌లో అత్యంత విలువైన 500 ప్రైవేటు కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) మొదటిస్థానంలో నిలిచింది. యాక్సిస్ బ్యాంక్‌కు చెందిన వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగమైన బర్గండీ ప్రైవేట్, హురున్ ఇండియా సంయుక్తంగా ఒక నివేదిక తయారుచేశాయి. గతేడాది అక్టోబరు వరకు ఆయా కంపెనీల మార్కెట్ విలువ ఆధారంగా దీన్ని రూపొందించాయి. అందులోని కొన్ని ముఖ్యమైన వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.


**టాప్ 3 కంపెనీలు ఇవే..**

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.15.6 లక్షల కోట్లు (ప్రస్తుత విలువ రూ.19.65 లక్షల కోట్లు). దాంతో ఈ కంపెనీ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రూ.12.4 లక్షల కోట్లతో (ప్రస్తుత విలువ రూ.14.90 లక్షల కోట్లు) రెండో స్థానంలో ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.11.3 లక్షల కోట్లతో (ప్రస్తుత విలువ రూ.10.55 లక్షల కోట్లు) మూడో స్థానంలో ఉన్నాయి. ప్రైవేటు రంగంలోని టాప్-500 కంపెనీల (రిజిస్టర్డ్, అన్ రిజిస్టర్డ్) మార్కెట్ విలువ 2.8 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.231 లక్షల కోట్లు)గా ఉంది. సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్, సింగపూర్‌ల సంయుక్త జీడీపీ కంటే ఈ మొత్తం అధికం. ఏడాది వ్యవధిలో ఈ కంపెనీలు 13% వృద్ధితో 952 బిలియన్ డాలర్ల (సుమారు రూ.79 లక్షల కోట్ల) విక్రయాలను నమోదు చేశాయి. ఒక త్రైమాసికంలో దేశ జీడీపీ కంటే ఇవి ఎక్కువ. దేశంలోని 70 లక్షల మందికి (మొత్తం ఉద్యోగుల్లో 1.3 శాతం) ఈ కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పించాయి. ఒక్కో కంపెనీ సగటున 15,211 మందికి ఉపాధి కల్పించగా, ఇందులో 437 మంది మహిళలు ఉన్నారు. 179 మంది సీఈఓ స్థాయిలో ఉన్నారు. కంపెనీ స్థాపించి 10 ఏళ్లు కూడా పూర్తవని సంస్థలు 52 ఉన్నాయి. 235 ఏళ్ల చరిత్ర కలిగిన ఈఐడీ-ప్యారీ కూడా 500 కంపెనీల జాబితాలో ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్‌నకు చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ జాబితాలో 28వ స్థానం సాధించింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లు 2023 ఎడిషన్‌లో మరోసారి టాప్-10 జాబితాలోకి చేరాయి.

# మళ్లీ సెంటిమెంట్ వైపు తెలంగాణ రాజకీయాలు

-మొదటి పేజి తరువాయి

ప్రాజెక్టులను రివర్ బోర్డుకు అప్పగించడానికి అంగీకరించిందంటూ బీఆర్ఎస్ వివాదం చేసింది. దీనిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆద్వర్యంలో నల్గొండలో సభ జరపతల పెట్టిన నేపథ్యంలో ఈ అంశాన్ని కాంగ్రెస్ చేపట్టి శాసనసభలో ఏభై శాతం నీటి వాటా ఇచ్చేవరకు ప్రాజెక్టులను అప్పగించబోమంటూ ఒక తీర్మానాన్ని పెట్టింది. ఆ తీర్మానానికి బీఆర్ఎస్‌తో సహా వివిధ పార్టీలు ఆమోదం తెలిపాయి. బీఆర్ఎస్ మాత్రం ఆ తీర్మానంలో తమ గత ప్రభుత్వంపై చేసిన విమర్శలను తొలగించాలని డిమాండ్ చేసింది. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎమ్‌బీ) కు ప్రాజెక్టులు అప్పగిస్తే తెలంగాణకు నష్టం జరుగుతుందని, దానికి ముందు తెలంగాణకు కూడా కృష్ణా జలాలలో ఏభై శాతం ఇవ్వాలని తెలంగాణ రాజకీయ పక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ట్రిబ్యునల్ నిర్ణయం ప్రకారం ఉమ్మడి ఏపీకి 811 టీఎమ్‌సీల నీటిని కేటాయించారు. రెండు రాష్ట్రాలలో ఉన్న ప్రాజెక్టుల ఆధారంగా, ఇతర ప్రాధాన్యాల ఆధారంగా తెలంగాణకు 299 టీఎమ్‌సీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎమ్‌సీలు నీటిని వాడుకునే అవకాశం కల్పించారు. రాష్ట్ర విభజన సమయంలో దీనికి ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. దానికి కారణం ఏమిటంటే అప్పుడు తెలంగాణ రాష్ట్రం సాధన ముఖ్యం అంతా భావించారు. నీళ్లు, నియామకాలు, నిధులు అంశాల ప్రాతిపదికన తెలంగాణ ఉద్యమం వచ్చిందని భావిస్తారు. ఇప్పుడు అదే నీటి అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రాజకీయ లబ్ది పొందడానికి యత్నించాయి. వచ్చే పార్లమెంటు ఎన్నికలలో ఈ సెంటిమెంటును వాడుకోవడానికి ఈ రెండు పార్టీలు ఇప్పటినుంచే కృషి చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించడాన్ని బీఆర్ఎస్ తప్పుపడుతుంటే, ఆ మొత్తం తప్పంతా బీఆర్ఎస్ దేనని కాంగ్రెస్ బుట్ట బోర్లవేస్తోంది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇస్తూ ఎప్పుడెప్పుడూ ఏమి జరిగింది? చెప్పే యత్నం చేశారు. కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్ ఆధ్వర్యంలో ఎఫెక్స్ కమిటీ సమావేశంలో కృష్ణా జలాలలో తెలంగాణకు 299 టీఎమ్‌సీలు వాటానీటికి, ఏపీకి 511 టీఎమ్‌సీలు నీరు ఇవ్వడానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అంగీకరించారని ఉత్తమ్ తెలిపారు. కొద్ది నెలల క్రితం కేసీఆర్ వద్ద పనిచేసిన ప్రభుత్వ కార్యదర్శి స్మితా సబర్వాల్ ప్రాజక్టులను అప్పగించడానికి అంగీకరిస్తూ లేఖ రాశారని, దానిని ఆమోదించడం లేదని, ఏభై శాతం నీటి వాటాకు ఒప్పుకుంటేనే బోర్డుకు అప్పగిస్తామని ఉత్తమ్ చెప్పారు. ఈ క్రమంలో నీటి పారుదల శాఖను కేసీఆర్ నాశనం చేశారని, వేల కోట్లు దుర్వినియోగం చేశారని ఉత్తమ్



ఆరోపించారు. ఈ వ్యవహారంలో మొత్తం తప్పు బీఆర్ఎస్‌దే తప్పు అని రుజువు చేయడానికి మంత్రి వాదన వినిపించారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఉన్న స్నేహం కారణంగానే పోతిరెడ్డి పాడు రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44వేల క్యూసెక్కుల నుంచి 92 వేల క్యూసెక్కులకు పెంచుకోగలిగారని, అలాగే రాయలసీమ లిఫ్ట్ ద్వారా రోజుకు 8 టీఎమ్‌సీలు తీసుకువెళ్లే స్కీమ్‌ను చేపట్టారని ఆయన అన్నారు. కాగా ఒక సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుంటూ ప్రతిపక్షనేత కేసీఆర్ ఎందుకు సభకు రావడం లేదని ప్రశ్నించారు. ఆయన వచ్చి ఇంతటి ముఖ్యమైన విషయంపై మాట్లాడాలి కదా అని అన్నారు. ఈ చర్చలో పాల్గొంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు తమ పార్టీపై నెపం వేయడానికి మంత్రి వక్రీకరణ చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ప్రాజెక్టులను కేఆర్ఎమ్‌బీకి అప్పగించడానికి అంగీకరిస్తూ అధికారులు లేఖ రాశారని ఇటీవలవరకు ఉన్న ఈఎన్‌సీ మురళీదర్ బోర్డు సమావేశం తర్వాత చేసిన వ్యాఖ్యల వీడియోను హరీష్ ప్రదర్శించారు. దానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి జోక్యం చేసుకుంటూ ఆయన బీఆర్ఎస్ ఏజెంట్ అని అందుకే తీసివేశామని, మరికొందరు ఏజెంట్లు ఉన్నారని, వారిపై కూడా చర్య తీసుకుంటామని అన్నారు. హరీష్ రావు, మరో నేత కడియం శ్రీహరిలు 299 టీఎమ్‌సీల కేటాయింపు తమకు సంబంధం లేనిదని, గతంలో ట్రిబ్యునల్ చేసిందని వివరించే యత్నం చేశారు. మంత్రి ఉత్తమ్ ఆ విషయాన్ని దాటవేస్తూ మాట్లాడడం విశేషం. అలాగే కేసీఆర్ సభకు రాని అంశాన్ని హరీష్‌రావు సమాదానం చెప్పకుండా దాటవేశారు. నిజానికి తెలంగాణకు కేటాయించిన 299 టీఎమ్‌సీల నీటిని పూర్తిగా వాడుకోగలిగితే ముప్పై లక్షల ఎకరాలు సాగు చేయవచ్చు. కాని ఇంకా ఆ పరిస్తితి రాలేదు. అంతేకాక కృష్ణానదికి నీరురావడం ఆరంభం అయిన వెంటనే కల్వకుర్తి వంటి లిఫ్ట్ స్కీమును ఆపరేట్ చేసి నీటిని తీసుకోవచ్చు. వీటన్నిటినీ విస్మరించి, కేఆర్ఎమ్‌బీ ప్రాజెక్టులు అప్పగించడం వల్ల ఏదో నష్టం జరుగుతుందన్న చందంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చర్చను జరిపారయి. ఇది పరస్పరం విమర్శలకే ఉపయోగపడుతుంది. కేసీఆర్ కూడా ఎన్నికలలో పరాజయం తర్వాత తొలిసారి నల్గొండలో కృష్ణా జలాలకు సంబంధించిన సమస్యపైనే భారీ సభలో మాట్లాడబోతున్నారు. అంటే తెలంగాణ సెంటిమెంట్ తమతోటే ఉండేలా వారుప్లాన్ చేసుకుంటున్నారని అనుకోవాలి. దీనిని తిప్పికొట్టడానికి కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టు బీటలు వారిన వైనం, అవినీతిపై ఫోకస్ పెట్టింది. కాగా బీజేపీ సభ్యుడు మహేష్ రెడ్డి మాట్లాడుతూ రెండు రాష్ట్రాలు ఘర్షణ పడే పరిస్తితి ఉన్నప్పుడు కేఆర్ఎమ్‌బీకి ప్రాజెక్టులను అప్పగిస్తే తప్పేముందని అభిప్రాయపడ్డారు. బోర్డుకు ప్రాజెక్టులకు అప్పగించడం వల్ల వచ్చే నష్టం ఏమిటి? లాభం ఏమిటన్న దానిపై ఆలోచించాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఈ కోణంలో కాకుండా పరస్పరం నిందలు మోపుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చాయి. ఎమ్ఐఎమ్ నేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ విభజన చట్టం చేసినప్పుడే తాము ఈ సమస్యలు వస్తాయని చెప్పామని గుర్తు చేశారు. కానీ అప్పట్లో ఏ రాజకీయ పార్టీ దీని గురించి పట్టించుకోలేదని అన్నారు. వాస్తవానికి తెలంగాణలో ఉన్న నీటి ప్రాజెక్టులకు ఎంత నీరు అవసరమో, అంతమేర నీటిని పొందడానికి యత్నించడం తప్పు కాదు. కానీ ఆ పాయింట్‌లో ఈ నేతలు ఎవరూ మాట్లాడలేదు. కేవలం ఏభై శాతం కృష్ణానది జలాలలో వాటా ఇవ్వాలన్న డిమాండ్‌కే పరిమితం అయ్యారు. ఎందుకంటే వచ్చే పార్లమెంటు ఎన్నికలలో ఆయా పార్టీలు దీనిని ఒక నినాదంగా తీసుకోవాలని చూస్తున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ ఇప్పటికే సభలు, ఉద్యమాలకు పిలుపు ఇచ్చింది. దానిని తిప్పి కొట్టడానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతి వ్యూహం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రత్యేకించి కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు ప్లాన్ చేశారు. కర్నాటక రాష్ట్రం తుంగభద్ర నదిపై కడుతున్న కొత్త ప్రాజెక్టు, వర్షాభావ పరిస్థితిలో కృష్ణానదికి నీటి కొరత ఏర్పడుతున్న విషయాన్ని కూడా ఆయా సభ్యులు ప్రస్తావించారు. ఇంకో సంగతి చెప్పాలి. కేసీఆర్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు గతంలో భేటీ అయిన సందర్భాన్ని తనకు అనుకూలంగా వాడుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నించింది. అప్పట్లో గోదావరి నుంచి కృష్ణానదికి నీటిని మళ్లించే ఒక స్కీమును కేసీఆర్ ప్రతిపాదించారు. దానికి తొలుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముఖత వ్యక్తం చేశారు. అప్పుడు ఏపీ శాసనసభలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిని ప్రశంసించారని అంటూ ఉత్తంకుమార్ రెడ్డి ఒక వీడియోని ప్రదర్శించారు. నిజానికి అది అవుట్ ఆఫ్ కాంటెక్స్టుగా దానిని చూపారు. ఆ తర్వాత రోజులలో ఏపీ ప్రభుత్వం ఆ స్కీముపై వెనక్కి తగ్గింది.

# వెంటపడుతం.. వేటాడుతం..!

-మొదటి పేజి తరువాయి

ఈ రోజు చలో నల్గొండ కార్యక్రమం ఎందుకు తీసుకోవాల్సి వచ్చింది? కొందరికి ఇది రాజకీయం. కానీ.. ఇది ఉద్యమ సభ.. పోరాట సభ అని రాజకీయ సభ కాదని తెలిపారు. తెలివిలేక.. ప్రభుత్వాన్ని నడిపే చేతగాక మందిమీద బద్నాంపెట్టి బతు కుదా మనుకుంటున్నారా? అట్లగాదు బిడ్డా జాగ్రత్తా..! బతుకనివ్వం.. వెంటప డుతం.. వేటాడుతాం అంటూ అధికార కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ అధినేత కే చంద్ర శేఖరావు హెచ్చరించారు. ఛలో నల్లగొండ సభలో కాంగ్రెస్ సర్కారు పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రం వచ్చాక కరెంటు తెచ్చాం. ఏడెనిమిది నెలల్లో కరెంటు బాగు చేసి ఏడాదిన్నర నుంచి 24గంటల కరెంటు రైతాంగానికి ఇచ్చాం. మీరంతా సంతోషంగా నడింట్లో పం డుకొని పంటలు పండించారు. పాములు, తేళ్లు కరువంగా బాయిలకాడికి పోలే. కేసీఆర్ గవర్నమెంట్ పోంగనే కట్కేసినట్టే బంద్ అవుతుందా కరెంటు? నేను తొమ్మిదేళ్లు ఇచ్చిన కరెంటు దానికి ఏం రోగం అయ్యింది.. మాయ రోగం వచ్చిందా? యాడపోయే కరెంటు' అంటూ మండిపడ్డారు.

**దద్దమ్మల రాజ్యమైతే గట్లనే ఉంటది..**

'దద్దమ్మల రాజ్యం ఉంటే గట్లనే ఉంటది. చాతగాని చవటల రాజ్యం ఉంటే గట్లనే ఉంటది. వాళ్లు ఉన్నంత మాత్రాన మనం నర్వస్ కావొద్దు. ఎక్కడికక్కడ మనం నిలదీయాలి. ఏమైందిరా బిడ్డ నా కరెంటు అని అడగాలి. ఇవాళ నేను ఒక మాట కుల్లకుల్లగా చెబుతున్న. మొన్నటిదాకా నడిచిన కరెంటు కాకుండా.. ఇదే మిర్యాలగూడ నియోజకవర్గంలో దామరచర్ల మండలంలో 4వేల మెగాపవర్ ప్లాంట్ కట్టినం జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో. 90శాతం పనులు పూర్తయ్యాయి. రెండుమూడు నెలలు తిప్పలుపడితే 4వేల మెగావాట్ల పవర్ వస్తుంది. రామగుండంలో ఆ నాడు మొదలుపెట్టిన ఎన్టీపీసీ 800 మెగావాట్ల పవర్ వచ్చింది. ఇంకో 800 మెగావాట్లు రాబోతున్నది. ఆ నాడు నడిపిన నాడు ఉన్నదాని కంటే 5600 మెగావాట్ల పవర్ కరెంటు ఎక్కువగ ఉండంగ కూడా.. వీళ్లకు ఏం రోగం పుట్టింది.. కరెంటు ఎందుకు ఇస్తలేరు ? ఎందుకు తిప్పలుపెడుతున్నరు ? బిడ్డా ఛలో నల్లగొండతోనే ఆపం. ఎక్కడ దొరికితే అక్కడ బజార్లలో నిలదీస్తాం' అని స్పష్టం చేశారు.

కృష్ణా నీళ్లమీద మన హక్కు అనేది.. మనందరి బతుకులకు చావో రేవో తేల్చే సమస్య అని తెలిపారు. ఈ మాట తాను తెలంగాణలో పక్షిలాగా తిరుగుతూ చెప్పవట్టి 24 ఏళ్లు అయిందని తెలిపారు. కృష్ణా కావోచ్చు.. అటు గోదావరి కావోచ్చు. నీళ్లు లేకపోతే మనకు బతుకు లేదు. ఇదే నల్గొండలో నీళ్లు లేకపోతే ప్రజల బతుకులు వంగిపోయాయి. లక్షా యాభై వేల మంది మునుగోడు, దేవరకొండ ఇరత ప్రాంతాల్లో బిడ్డల నడుములు ఫ్లోరైడ్‌తో వంగిపోయాయి. చివరికి ఈ జిల్లాలో ఉద్యమకారలంతా కలిసి ఫ్లోరైడ్ ఎఫెక్ట్ అయిన బిడ్డలను తీసుకెళ్లి ప్రధానమంత్రి టెబుల్‌పై పడుకోబెట్టి.. అయ్యా మా బతుకు ఇది అంటే పట్టించుకున్నవారు లేరు. ఆనాడు పార్టీలు లేవా.. మంత్రులు



లేరా? ఎవరు పట్టించుకోలే. నల్గొండలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక జీరో ఫ్లోరైడ్‌గా చేశాం. ప్రజలను అడిగితే చెబుతున్నారు. మిషన్ భగీరత నీళ్లతో తమకు బాధలు లేవని చెబుతున్నారు. ఏడాదు ఏ నాయకుడు పటట్టించుకోలే. ఇప్పుడు జరుగుతున్నది ఏంటి? ఈ సభ పెట్టింది ఎందుకు? కొంత మంది? సన్నాసులు తెలివి లేక వాళ్లకు వ్యతిరేకం అనుకుంటున్నారు. తాను ఒక్కటే మాటలో జరగవల్సింది చెబుతా.. ఉవ్వెత్తున మనం ఎగిసిపడకపోతే.. మనల్ని మనం కాపాడుకునే ప్రయత్నం చేయకపోతే.. ఎవరూ కూడా మన రక్షణకు రారు. ఈ మాట రాసి పెటట్టుకోండి. ఆనాడు ఫ్లోరైడ్ సమయంలో ఎవరూ రాలేదు. ఓట్లు ఉన్నప్పుడు వస్తారు కబుర్లు చెప్పడానికి కానీ, తర్వాత ఎవరూ రారు. ఓటు గుద్దినం గడ్డకు ఎక్కిన్రు అంటే మన వీపులో గుద్ది బొందలోకి నెట్టిన్రు తప్పితే ఎవరూ రాలే. ఇది జరిగిన చరిత్ర.. ఇప్పుడు జరుగుతున్న చరిత్ర.. దయచేసి మీరు గనించాలి. ఇది చిల్లరమల్లర రాజకీయ సభకాదు. రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర నాయకులకు, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యూనల్, కేంద్ర నీటి పారుదల శాఖ మంత్రికి గాని మన నీళ్లు దొబ్బి పోదామనుకునే స్వార్థ శక్తులకు గాని.. ఈ చలో నల్గొండ సభ ఒక హెచ్చరిక అని మండిపడ్డారు.

**ప్రజలను ఇబ్బందుల పెడితే బజారులో నిలబెడతాం..**

'ప్రజలను కరెంటుకు తిప్పలు పెట్టినా.. నీళ్లకు తిప్పలుపెట్టినా.. మంచినీళ్లకు తిప్పలుపెట్టినా ఎక్కడికక్కడ మిమ్మల్ని నిలబెడుతాం. మీకు గవర్నమెంట్ ఇచ్చారు. మాకు ప్రతిపక్షం బాధ్యత ఇచ్చారు. మిమ్మల్ని నిలదీసే బాధ్యత ఇచ్చారు తప్పా.. ఎక్కడికక్కడ మిమ్మల్ని నిలదీస్తం తప్పా.. వదిలిపెడతాం అనేదాంట్లో ఉండొద్దు. ప్రజలకు అన్యాయం చేయొద్దు. నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా.. ఏ విధంగా బీఆర్ఎస్ గవర్నమెంట్ ఇచ్చిందో.. ఆ విధంగా కరెంటును పునరుద్ధరించాలి. ఆవిధంగా రాష్ట్ర రైతాంగానికి కరెంటు ఇవ్వాలి. కానీ వీళ్ల యవ్వారం ఎట్లున్నది ? చరిత్రలో ఎన్నడూ లేదు. అసెంబ్లీలో జనరేటర్ పెట్టారు వీళ్ల తెలివికి. మొన్న మనోళ్లు మీటింగ్‌లో తిరుగుతుంటే.. ఒక్క మీటింగ్‌లో మాట్లాడుతుంటే ఏడుమాట్లు పోతది కరెంటు. నల్లగొండలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతుంటే ఏడుసార్లు కరెంటు పోతది. ఏం మాయరోగమచ్చింది. మీకు తెలివి లేక.. నడపరాక.. చేతగాక ఇవాళ మందిమీద బద్నాం పెట్టి బతుకుదామనుకుంటున్నరా? అట్లగాదు బిడ్డా జాగ్రత్త బతుకనివ్వం. వెంటపడుతం. వేటాడుతం' అని హెచ్చరించారు.

**ఇది మునుపటి యెడ్డి తెలంగాణ కాదు.. ఇది టైగర్ తెలంగాణ : కేసీఆర్**

ఇది మునుపటి యెడ్డి తెలంగాణ కాదు.. లేచిన తెలంగాణ.. ఇది టైగర్ తెలంగాణ.. ఒక ఆవాజ్ ఇస్తే లక్ష పిడికిళ్లు ఎత్తి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్న తెలంగాణ అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. చలో నల్లగొండ సభలో కేసీఆర్ మాట్లాడారు. మీరు గెలిచింన్రు ఐదేండ్లు అధికారంలో ఉండండి.. మాకు అభ్యంతరం లేదు. సరే ప్రతిపక్షంలోకి వచ్చాం నాలుగు రోజులు ఆరాం తీసుకుందాం అనుకున్నా. కానీ ఏం జేసింన్రు.. నల్ల ముఖం పిల్లి పోయి సచ్చిపోయిన ఎలుకను పట్టిందట. గవర్నమెంట్ వచ్చుడు వచ్చుడే కృష్ణా నీళ్లను తీసుకుపోయి కేఆర్ఎంబీకి అప్పజెప్పింన్రు. కట్టమీద మీద మొత్తం రిజర్వ్ పోలీసులు ఉన్నారు. మంచినీళ్ల కోసం చిప్పపట్టుకుని అడుక్కోవాలి. శ్రీశైలం కరెంట్ ఉత్పత్తి చేయాలంటే అడుక్కోవాలి. మనకున్న అధికారాన్ని అప్పజెప్పింన్రు. నేను తొమ్మిదేండ్లు కాపాడిన దాన్ని.. నన్ను కూడా బెదిరించారు.. ఏ కేసీఆర్ నీ గవర్నమెంట్ తీసేస్తాం.. రాష్ట్రపతి పరిపాలన పెడుతాం అన్నరు. దమ్ముంటే పెట్టమని చూద్దామన్నా.. కానీ అప్పజెప్పలేదు. నా మీద కూడా ఒత్తిడి తెచ్చింన్రు. ఎప్పకప్పటిడు లెటర్లు రాసుకుంటూ పార్లమెంట్‌లో మన ఎంపీలు పోరాటం చేశారు. కానీ వీరు అప్పజెప్పింన్రు అని కేసీఆర్ తెలిపారు.

**అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలి..**

మొన్న మన ఎంపీలు కేంద్ర ఇరిగేషన్ మంత్రి వద్దకు పోయారు.. ఆ మంత్రిని కలిస్తే కేఆర్ఎంబీ ఎట్ల తీసుకుంటావు అని అడిగితే.. మీ గవర్నమెంట్ వచ్చి ఒప్పుకొని పోయిందని చెప్పారు. ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టింన్రు. ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి, ఇతర మంత్రులు గానీ ఇప్పటికైనా పిచ్చిన పనులు బంద్ చేసి, అఖిలపక్షాన్ని తీసుకొని ఢిల్లీకి పోవాలి. మాట్లాడాలి. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు టైం ఫ్రేమ్ పెట్టాలి. దశాబ్దాల నుంచి అన్యాయం జరిగింది కాబట్ట ఆరు నెలల్లోగా తేల్చాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చేలా ఒత్తిడి తేవాలి. గొంగడి, చెప్పులు నావి కాదన్నట్టు.. నాకేం జిమ్మేదారి లేదనట్టు.. అధికారంలోకి వచ్చినం మళ్ల చూసుకుందాం ఐదేండ్ల నాటికి అనుకుంటే ఊరుకోరు.

## పంజాగుట్ట డ్రగ్స్ కేసు: స్టాన్లీ కాంటాక్ట్ లిస్ట్‌లో ప్రముఖల పేర్లు



**హైదరాబాద్:** పంజాగుట్ట డ్రగ్స్ కేసు నిందితుడు స్టాన్లీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవలే రూ.8 కోట్ల విలువైన డ్రగ్స్‌తో స్టాన్లీ పట్టుబడ్డ విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో పలువురు ఏజెంట్లను స్టాన్లీ రిక్రూట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. స్టాన్లీ కాంటాక్ట్ లిస్ట్‌లో ప్రముఖల పేర్లు ఉండటం గమనార్హం. స్టాన్లీ డ్రగ్స్ లింక్స్.. పోలీసుల కస్టడీ విచారణలో ఒక్కొ?క్కటిగా బయటపడుతునన్నాయని పోలీసులు పేర్కొన్నారు. అతనికి నైజీరియాలో డ్రగ్స్ తయారీదారులతో నేరుగా సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 500 మందితో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## సీఎం మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన పొలిటికల్ డ్రామానే..

-మొదటి పేజి తరువాయి

లేదన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు దెబ్బతిన్న వెంటనే గత ఏడాది అక్టోబర్ 22వ తేదీన కేంద్ర జలశక్తి మండలికి లేఖ రాసినట్లు గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు ప్లానింగ్‌లో లోపలున్నాయని కేంద్ర జలశక్తి మండలి రిపోర్ట్ ఇచ్చిందని కిషన్‌రెడ్డి తెలిపారు.

## ఏసీబీ దూకుడు.. శివబాలకృష్ణ బినామీలందరికీ నోటీసులు



**హైదరాబాద్ :** హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అక్రమాస్తుల కేసు విచారణలో వేగం మరింత పెంచింది అవినీతి నిరోధక శాఖ(%ాజదీ%). ఈ క్రమంలో విచారణకు రావాల్సిందేనంటూ బినామీలందరికి నోటీసులు జారీ చేసింది. అంతేకాదు.. బాలకృష్ణ ఆస్తులకు సంబంధించిన లావాదేవీలను నిలిపివేయాలని కలెక్టర్‌కు ఏసీబీ లేఖ రాసింది. శివబాలకృష్ణకు బినామీలుగా వ్యవహరించిన భరత్, సత్యానారాయణ, భరణిలకు ఏసీబీ నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఆయనకు సహకరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారి విషయంలోనూ చర్యలకు ఏసీబీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. దర్యాప్తులో దొరికిన పత్రాల ఆధారంగా.. ప్రభుత్వ అనుమతి తీసుకుని ఆ ఐఏఎస్‌పై చర్యలు తీసుకోవాలని ఏసీబీ భావిస్తోంది. ఇదిలా ఉంటే.. 2021-23 సంవత్సరాల మధ్య శివబాలకృష్ణ కోట్ల ఆస్తుల్ని కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. అయితే ఆ ఆస్తులన్నింటినీ ఆయన తన కుటుంబ సభ్యుల పేరిట రిజిస్టర్ చేయించారు. ఈ క్రమంలో యాదాద్రిలో 57 ఎకరాల భూమిపై ప్రత్యేక విచారణ చేయాలని ఏసీబీ భావిస్తోంది.

## మేడిగడ్డ అద్భుతాలను వివరించండి

-మొదటి పేజి తరువాయి

వచ్చాయి. దీంతో మా ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టింది. విజిలెన్స్ విచారణ చేపట్టి పూర్తి నివేదిక ఇచ్చింది. అక్కడ ఏం జరిగిందో తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతీ శాసనసభ సభ్యుడిపై ఉంది. సభలో విజిలెన్స్ నివేదికపై చర్చ చేపట్టాల్సిన అవసరం ఉంది. అందుకే మనమంతా మేడిగడ్డ బ్యారేజీని విజిట్ చేద్దామని అన్నారు. కేసీఆర్ కు నేను విజ్ఞప్తి చేస్తున్నా. మీరు, మీ శాసన సభ్యులు మేడిగడ్డకు రండి.. మీరు ఆవిష్కరించిన అద్భుతాలను దగ్గరుండి వివరించండని అన్నారు. మీ అనుభవాలను అక్కడ అందరికీ వివరించి చెప్పండి. తాజ్ మహల్ లాంటి ఆ అద్భుతాన్ని ఎలా సృష్టించారో అందరికీ చెప్పండి. జరిగిన వాస్తవాలు తెలంగాణ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందా? లేదా? తప్పు జరిగిందా లేదా? జరిగితే కారణం ఎవరు?.. శిక్ష ఏమిటి..? కాళేశ్వర్ రావు అని గతంలో ఆయన్ను ఆనాటి గవర్నర్ సంభోదించారు. కాళేశ్వర్ రావు ని అక్కడికి రావాల్సిందిగా కోరుతున్నా. మీకు బస్సుల్లో రావడం ఇబ్బంది అనుకుంటే... హెలికాప్టర్ కూడా సిద్ధంగా ఉంది. రేపో ఎల్లుండో సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి శ్వేతపత్రం విడుదల చేస్తారు. కాళేశ్వరం కథేంటో సభలో తెలుద్దామని అన్నారు. . తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అయిదో రోజు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై సభలో చర్చ జరగనుండగా..కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చర్చను వాయిదా వేసి మేడిగడ్డ పర్యటనకు వెళ్లనున్నారు. సభ ప్రారంభమైన తరువాత మేడిగడ్డ బ్యారేజీలో అవినీతిపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మాట్లాడారు.

**మేడిగడ్డకు అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నాం: సీఎం రేవంత్ రెడ్డి**

సభ్యులు వాస్తవాలు చూడాలి. ్నమేడిగడ్డ పర్యటనకు కేసీఆర్‌ను కూడా ఆహ్వానించాం. కేసీఆరే ముందుండి ఈ ప్రాజెక్ట్ గురించి వివరిస్తే బాగుంటుంది. బస్సుల్లో రావడం ఇబ్బందైతే హెలికాప్టర్‌లో రావచ్చు. కేసీఆర్ కోసం హెలికాప్టర్ కూడా సిద్ధం చేస్తాం. సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలు అని పెద్దలు చెప్పారు. ప్రాజెక్టు రీడిజైన్ అనే బ్రహ్మపదార్థాన్ని కనిపెట్టి అంచనాలు పెంచారు. సాగునీటి ప్రాజెక్టులపై నిన్న చర్చించి వాస్తవాలు చెప్పాం. ఇసుక కదిలితే ప్రాజెక్టు కుంగిందని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పింది. కుంగిన ప్రాజెక్ట్‌ను చూడకుండా గత ప్రభుత్వం దాచిపెట్టింది. అక్కడికి ఎవరూ వెళ్లకుండా భారీగా పోలీసులను పెట్టి అడ్డుకున్నారు. కొందరు అధికారులు డాక్యుమెంటను మాయం చేశారు. ఫైళ్ల మాయంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాం సభ్యులు వాస్తవాలు చూడాలి

## మేడిగడ్డ బ్యారేజీ పగుళ్లను పరిశీలించిన రేవంత్ రెడ్డి, మంత్రులు

**తొలుత బ్యారేజీ పైనుంచి కుంగిన పిల్లర్లను పరిశీలించిన రేవంత్ అండ్ టీమ్**

**ఏం జరిగిందో అధికారులను అడిగి తెలుసుకున్న రేవంత్**

**పగుళ్ల ఏర్పడిన ప్రాంతాన్ని ప్రత్యేకంగా పరిశీలించిన సీఎం**

మేడిగడ్డ బ్యారేజీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరిశీలించారు. తొలుత బ్యారేజీ పైనుంచి కుంగిన పిల్లర్లను వీరు పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యారేజీ దిగువ భాగంలో కుంగిన పిల్లర్ల వద్ద ఏం జరిగిందో అధికారులను అడిగి సీఎం తెలుసుకున్నారు. ఆ తర్వాత 21వ పిల్లర్ వద్ద కుంగిన ప్రాంతం, పగుళ్ల ఏర్పడిన ప్రాంతాన్ని సీఎం బృందం పరిశీలించింది. ఏడో బ్లాక్ లోని పలు పిల్లర్లను వీరు పరిశీలించారు. పగుళ్ల ఏర్పడిన ప్రాంతాలను రేవంత్ ప్రత్యేకంగా పరిశీలించారు. వీరంతా మూడు ప్రత్యేక బస్సుల్లో మేడిగడ్డకు వెళ్లిన సంగతి తెలిసిందే. అంతకు ముందు రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా స్పందిస్తూ... రూ. 95 వేల కోట్లను ఖర్చు చేస్తే... 97 వేల ఎకరాలకు కూడా నీరు అందడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధన దాహానికి కాళేశ్వరం ప్రాజెక్టు బలయిందని ఆయన అన్నారు.

## సంపాదకీయం


# దర్యాప్తు సంస్థల ద్వంద్వ నీతులు

స్వతంత్ర రాజ్యాంగ సంస్థలుగా ఉండాల్సిన సిబిఐ, ఇడి, ఐటి సంస్థల దాడులు, కేసులు విచారణ, అరెస్టు లు, పని విధానం ప్రస్తుతం సంచలనం కలిగిస్తున్నాయి. నిజంగానే ఈ సంస్థలు అవినీతి రాజకీయ నాయకుల భరతం పడుతున్నాయా? లేక అధికార బిజెపి పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారి ప్రత్యర్థులపై కేసులు మోపి వేధిస్తున్నాయా? అనే అనుమానాలు ఇప్పుడు ప్రజల్లో కలుగుతున్నాయి. మన దాయాది దేశం పాకిస్థాన్‌లో పరిపాలన చేసిన మాజీ ప్రధానులు అధికారం కోల్పోయిన తర్వాత దేశం విడిచి పారిపోవడమో, జైలు ఊచలు లెక్కించడమో, లేక దారుణమైన హత్యలకు గురికావడమో జరుగుతుంది.ఇదే మనకు ఆశ్చర్యం కలిగించే అంశం అయితే. అంతకంటే మనం ఓ అడుగు ముందుకేసి రాజ్యాంగ సంస్థలు అధికారం కనుసన్నల్లో నడిపి రాజకీయ స్థిరత్వానికి పనిముట్టుగా వాడుకుంటున్నారా? ప్రత్యర్థులపై దాడులకు వినియోగిస్తున్నారా? అన్న అనుమానాలు ప్రజల్లో బలపడుతున్నాయి. ప్రధానిగా మోడీ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత రాజ్యాంగ సంస్థలైన సిబిఐ, ఇడి, ఐటి దాడులు ప్రత్యర్థి రాజకీయ పార్టీలపై నిత్యకృత్యమయ్యాయి. అంతేకాదుచివరకు, న్యాయ వ్యవస్థ, చట్టసభల స్వతంత్రను సైతం అనుమానించేలా కొన్నిసంఘటనలు జరుగుతున్నాయి. దేశంలో చురుకైన ప్రత్యర్థులు అందరిపై సిబిఐ, ఇడి, ఐటి దాడులు, కేసులు నిత్యకృత్యం అయ్యాయి. మోడీ రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత రాజ్యాంగ సంస్థలు ప్రతిపక్షాలపై పెట్టిన కేసుల సంఖ్య పెరిగాయి. ముఖ్యంగా ప్రతిపక్షాలను బలహీనపరచడానికి, అవినీతి బురద చల్లడానికి ఇదో భయానక, బెదరగొట్టే, చెదరగొట్టే రాజకీయ వ్యూహంగా మారిందన్న విమర్శలు లేకపోలేదు? ఇటీవల ఈ విధానం మరింత నగ్నంగా ముందుకొచ్చింది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రత్యర్థి రాజకీయ పక్షాల ప్రభావిత నేతల్ని ప్రచారానికి దూరం చేయాలన్న వ్యూహం కనిపిస్తుందని, బిజెపిపై 'ఇండియా' కూటమి ఆరోపణగా ఉంది? ఇటీవల జరిగిన సంఘటనలే తీసుకుంటే భూకుంభ కోణం పేరుతో జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఇడి అరెస్టుకు ముందు ముఖ్యమంత్రిగా రాజీనామా చేయడంతో జార?ండ్ రాష్ట్రంలో అధికార సంక్షోభం ఏర్పడింది. జార?ండ్ ముక్తి మోర్చాను స్థాపించి గిరిజన ఉద్యమం ద్వారా శిబుసోరెన్ స్వతంత్రంగా జార?ండ్‌లో అధికారం లోనికి వచ్చారు. ఆయన కుమారుడే హేమంత్ సోరెన్. కాంగ్రెస్‌తో కలిసి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన హేమంత్ సోరెన్ బిజెపి ప్రత్యర్థిగా ప్రస్తుతం గిరిజన తిరుగుబాటు నేత పేరుతో ఉన్న బిర్సాముండా జైలులో విచారణ ఖైదీగా ఉన్నారు. ఇక ఇదే బాటలో ఎన్నికల ముందు డిల్లీ సిఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసే కుట్ర జరుగుతోందని ఆప్ ఆరోపించింది. నిజంగా కేజ్రీవాల్ పరిస్థితిని బిజెపి విచారణ పేరుతో భయానకంగా మార్చింది. అవినీతికి వ్యతిరేక ఉద్యమంలో పుట్టన కేజ్రీవాల్, ఆమ్‌ఆద్మీ పార్టీని పీకల్లోతు అవినీతి కేసుల్లోకి దింపి ఆ పార్టీ రాజకీయ మార్క్‌ను బిజెపి తుడిచివేసిందనే ఆవేదన ఆప్ కార్యకర్తల్లో ఉంది. ఆప్ జాతీయ పార్టీ హెూదా పొందడం, పంజాబ్ విజయం తర్వాత ఆప్ పార్టీపైన ఈ రకమైన దాడులు తీవ్రం అయ్యాయనే అనుమానం ఆ పార్టీ నేతలలో ఉంది. ఇంకా చిత్రం ఏమంటే తమ ఎంఎల్ఎలను కొనుగోలు చేసి తమ ప్రభుత్వాన్ని అస్థిర పరిచే కుట్ర జరుగుతోందని ఆరోపించిన కేజ్రీవాల్, విద్యామంత్రి ఆతీశీలపై బిజెపి కేసుపెట్టి కేంద్రం ఆధీనంలోని పోలీసులను ముఖ్యమంత్రిని విచారించేందుకు పంపడం విశేషం. ఇంతకీ కేజ్రీవాల్ అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్న కేసు ఢిల్లీ లిక్కర్ కుంభకోణం. ఇదీ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సిఫార్సుల మేరకు సిబిఐ, ఇడి చేపట్టిన కేసులే! వందకోట్ల కుంభకోణం అన్నారే కానీ ఇంత వరకు ఎలాంటి రికవరీలేదు. ఇప్పటికే ఢిల్లీ విద్యా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఈ కేసులో ఏడాదిగా విచారణ ఖైదీగా జైలులో ఉన్నారు. దేశానికే తలమానికంగా వైద్యం ప్రజలకు చేరువ చేసిన మోహాళ్ళ క్లినిక్ సృష్టి కర్త సత్యేంద్ర జైన్ ఇడి అండర్ ట్రయల్ ఖైదీగా రెండేళ్ళుగా జైలులో మగ్గుతున్నారు. ఇంకా మరీ విచిత్రం ఏమంటే ఆప్ ఎంపి సంజయ్ సింగ్‌కు ఈ కేసులో ఎలాంటి సంబంధం లేకుండా చార్జిషీట్‌లో తన పేరు ఉచ్ఛరించారని బహిర్గతం చేసిన ఆయనకు సిబిఐ బహిరంగంగా పొరపాటు జరిగింది అని ఒప్పుకొంది. అయితే ఆయన అటు తర్వాత పార్లమెంటులో మోడీ, అమిత్ షా విదానాలు దుయ్యబట్టారు, సస్పెండ్ అయ్యారు. చివరకు లిక్కర్ కుంభకోణంలో ఉన్న ఓ అప్రూవర్ స్టేట్‌మెంట్ తీసుకుని ఎవరికైతే కేసులో పొరపాటున పేరు ఉచ్ఛరించారని ఒప్పుకున్నారో అదే కేసులో నిజంగానే చేర్చి ప్రస్తుతం విచారణ ఖైదీగా జైలు పాలయ్యారు. ఇక బీహార్‌లో బిబిపికి కొరకరాని కొయ్యగా వున్న లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం దర్యాప్తు సంస్థల వేటలో ఉండనే ఉన్నారు. ఉదాహరణకు కూటమి మారి నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా బిజెపి అండతో అధికారం చేపట్టిన మరుసటి రోజే అంతకు ముందు ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న లాలూ కుమారుడు తేజస్వి యాదవ్‌కు సిబిఐ నోటీసులు ఇచ్చింది. ఇక దేశంలో బిజెపికి వ్యతిరేకంగా వున్న కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, తమిళనాడులో ఓ మంత్రి, శివసేన నేత సంజయ్ రౌత్, మమతా బెనర్జీ, సమాజ్ వాది నేత అఖిలేశ్ యాదవ్, చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, చివరకు గుజరాత్ గిరిజన నేత వరకు ఈ సంస్థలు కేసులు మోపబడ్డవారే. ఇంతేకాదు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిజెపి నుండి కాంగ్రెస్‌లో చేరిన మరుక్షణమే వివేక్ వెంకటస్వామిపై సైతం దాడులు జరిగాయి. వీటన్నింటి నేపథ్యంలోనే 'ఇండియా' కూటమి కన్వీనర్ మల్లిఖార్జున ఖర్గే మోడీ మళ్ళీ గెలిస్తే ఎన్నికలనేవి ఉండవు, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లా నియంతగా సెటిల్ అవుతారని ప్రమాద హెచ్చరికగా చేశారు. అయితే ఈ కేసులన్నీ చూసినప్పుడు అధికారం అనేది అవినీతికి దగ్గరగా ఉంటుందా! అన్న అనుమానం రాక మానదు. ఇకపోతే ఇవే రాజ్యాంగ సంస్థలు అధికార పక్షం బిజెపిపై ఒక్క కేసు నమోదు కావడం లేదు. అంటే ఆ పార్టీలో అంతానీతిమంతులేనా? అదే ప్రధాని చెప్పకనే చెప్పడానికి ప్రయత్నిస్తున్న వ్యూహంగా కనిపిస్తుంది. అయితే బిజెపి లో వున్న నేతలేం పూర్తిగా నీతిమంతులా అన్న ప్రశ్నలు ఉదయిస్తాయి. గతంలో కాంగ్రెస్ నాయకుడుగా ఉండగా ప్రస్తుత అసోం ముఖ్యమంత్రి హిమంతు బిశ్వాస్ శర్మపై సరస్వతి కుంభకోణం ఉంది. ఆయన బిజెపిలో చేరి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి నీతివంతులయ్యారు? కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యెడ్యూరప్ప పై అవినీతి మరకను బిజెపి చెరిపేసింది. బిజెపి పార్టీతో సఖ్యతగా వున్న ప్రాంతీయ పార్టీలు సైతం ఎన్ని కేసులు ఉన్నా భద్రంగానే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై చాలా కేసులు ఉన్నప్పటికీ కోర్టుకు సైతం హాజరు కావడం లేదు. కీలక సమయాల్లో బిజెపికి మద్దతు ఇచ్చి ఆయన భద్రంగానే ఉన్నారు. బిఆర్ఎస్‌పై ఎన్ని ఆరోపణలు వచ్చినా కేంద్ర పెద్దలు మోడీ, అమిత్ షా లు పలు మార్లు కెసిఆర్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. కానీ ఇడి, సిబిఐ విచారణకు కేంద్రం ఆదేశించింది లేదు. కారణం ఆయన ప్రస్తుతం కాంగ్రెస్ వ్యతిరేక పక్షంలో ఉండడమే? గతంలో మాదిరిగా మళ్లీ ఏదైనా అవసరం రావచ్చునే బిజెపి ముందు చూపు కావచ్చును. మొత్తం మీద రాజ్యాంగ సంస్థల దాడులు, కేసులు ఎన్నికల ముందు ఎవరు నీతిపరులు, ఎవరు అవినీతి పరులు? తేల్చే అవకాశం, విచారణ తంతు ఇప్పట్లో తేలే అవకాశం లేదు. కానీ ఎన్నికల ముందు ఈ వ్యవహారం కొందరికి మోదం, కొందరికి ఖేదంలా మారింది

# నవ్వుల రారాజు రాజబాబు

పుణ్యమూర్తుల అప్పలరాజు అనగానే ఎవరా అని ఆలోచించవచ్చు. రాజబాబు అంటే హాస్య నటునిగా తెలియని తెలుగు వారుండరు. రేలంగి, రమణారెడ్డి తరవాత అంతకు మించిన ప్రేక్షక ఆదరణ పొందిన నటునిగా గుర్తింపు పొందారు. తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత గొప్ప హాస్య నటుల్లో ఒకరు రాజబాబు. రెండు దశాబ్దాల తక్కువ వ్యవధిలో ఆయన శిఖర స్థాయిని అందుకున్నారు. దాదాపు 600 చిత్రాల్లో నటించిన రాజబాబు.. తెలుగు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తారు. అప్పట్లో ఆయన దక్షిణాదిన అత్యంత డిమాండ్ ఉన్న కమెడియన్లలో ఒకరు. రోజుకు రెండు మూడు షిఫ్టుల్లో విరామం లేకుండా పని చేసిన ఘనత ఆయనది. తెలుగు చలనచిత్ర రంగంలో రెండు దశాబ్దాలు హాస్యనటునిగా వెలిగిన రాజబాబు (అక్టోబరు 20, 1935 – ఫిబ్రవరి 14, 1983) "శతాబ్దపు హాస్య నటుడి"గా ప్రసంశలు అందుకొన్న గొప్ప వ్యక్తి. అక్టోబరు 20, 1935 తేదీన పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం లో పుట్టిన రాజబాబు పూర్తి పేరు పుణ్యమూర్తుల అప్పలరాజు. తల్లిదండ్రులు శ్రీ పుణ్యమూర్తుల ఉమామహేశ్వర రావు , శ్రీమతి రవణమ్మ. నిడదవోలు లోని పాఠశాల చదువు చదువుతూనే బుర్రకథ నేర్చుకోవడానికి శ్రీ అచ్యుత రామయ్య గారి దగ్గర చేరారు. ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత ఉపాధ్యాయ శిక్షణ కోర్సు ముగించి తెలుగు ఉపాధ్యాయునిగా కొద్దికాలం పని చేశారు.

ఉపాధ్యాయునిగా పనిచేసేటప్పుడే నాటకాలలో పాలుపంచు కొనేవారు. రాజబాబు డిసెంబరు 5, 1965 తేదీన లక్ష్మీ అమ్ములు ను వివాహమాడాడు. వారికి నాగేంద్రబాబు, మహేశ్ బాబు అనే ఇద్దరు సంతానం కలిగారు. ఒక సారి నాటకంలో రాజబాబును చూసిన గరికపాటి రాజారావు (పుట్టిల్లు సినిమా దర్శకుడు) సినిమాలలో చేరమని ఉత్సాహ పరిచారు. దాంతో చెప్పా చెయ్యకనే ఫిబ్రవరి 7, 1960 రోజున మద్రాసు చేరుకొన్నారు. పూట గడవడానికి హాస్య నటుడు అడ్డాల నారాయణరావు పిల్లలకు ప్రైవేటు చెప్పేవారు. కొన్నాళ్ళ తరువాత అడ్డాల నారాయణరావు రాజబాబుకి సమాజం సినిమాలో అవకాశం కల్పించారు. మొదటి సినిమా తరువాత "తండ్రులు–కొడుకులు","కులగోత్రాలు","స్వర్ణగౌరి","మంచి మనిషి" మొదలగు చిత్రాలలో అవకాశాలు వచ్చాయి. స్వర్ణగౌరి చిత్రానికి గాను 350 రూపాయలు మొట్టమొదటి పారితోషికంగా స్వీకరించారు. మొదటి చిత్రం విడుదల తరువాత వచ్చిన చిన్న చిన్న పాత్రలలో నటిస్తూనే "కుక్కపిల్ల దొరికిందా", "నాలుగిళ్ళ చావిడి", "అల్లూరి సీతారామరాజు" మొదలగు నాటకాలు వేశారు. జగపతి ఫిలింస్... వి.బి.రాజేంద్రప్రసాద్ చిత్రం "అంతస్తులు" చిత్రంలో నటించినందుకు గాను మొట్ట మొదటి సారిగా పెద్దమొత్తం 1300 రూపాయల్ని పారితోషికంగా పొందారు.





ఇక వెనక్కు తిరిగి చూసుకో వలసిన అవసరం లేకుండా వరుసగా నిర్మాణ సంస్థలు నిర్మించిన ఎన్నో చిత్రాలలో నటించారు. ఆకాశ రామన్న, సతీ శబరి, ప్రచండ భైరవి, సత్య హరిశ్చంద్ర, సంగీత లక్ష్మి, పరమానందయ్య శిష్యుల కథ, ఉమ్మడి కుటుంబం, విచిత్ర కుటుంబం లాంటి చిత్రాలలో నటించారు. రాజబాబుకు జంటగా లీలా రాణి, మీనా కుమారి, ప్రసన్న రాణి, గీతాంజలి లాంటి వారు నటించినా, ప్రేక్షకాదరణ పొందిన జోడీ మాత్రం రమాప్రభ అని చెప్పాలి. ఇద్దరు అమ్మాయిలు, ప్రేమనగర్, ఇల్లు ఇల్లాలు, పల్లెటూరి బావ, సెక్రెటరి, జీవన జ్యోతి, కార్తీక దీపం, అడవి రాముడు, సోగ్గాడు లాంటి చిత్రాలు రాజబాబు – రమాప్రభ జోడీకి మంచి హాస్య జంటగా పేరు తెచ్చాయి. రాజబాబు తాతా మనవడు, పిచ్చోడి పెళ్ళి, తిరుపతి, ఎవరికి వారే యమునా తీరే, మనిషి రోడ్డున పడ్డాడు లాంటి సినిమాలలో హీరోగా నటించారు. ఈ సినిమాలలో ఎవరికి వారే యమునా తీరే, మనిషి రోడ్డున పడ్డాడు సినిమాలను స్వయంగా బాబ్–బాబ్ ప్రొడక్షన్స్ అన్న నిర్మాణ సంస్థ పేరుతో నిర్మించారు. సినిమాలో ప్రేక్షకులను తన అద్భుత నటనతో కడుపుబ్బ నవ్వించిన రాజబాబు నిజ జీవితంలో గొప్ప తాత్విక ఆలోచనలు గలవారు.

ప్రతి ఒక్క సంవత్సరం తన పుట్టినరోజు సందర్భంగా పాతతరం నటుల్ని, నటీమణుల్ని సత్కరించే వాడు. ప్రత్యేకంగా హాస్యంలో తనకు స్పూర్తిని ఇచ్చిన బాలకృష్ణను సత్కరించారు. రాజబాబుచే సత్కారం పొందిన వారిలో ఇంకా డా.శివరామ కృష్ణయ్య, సూర్యకాంతం, సావిత్రి, రేలంగి మొదలగు ప్రముఖులు ఉన్నారు. ఎన్నో సంస్థలకు ఎన్నెన్నో విరాళాలిచ్చిన దాత రాజబాబు. రాజమండ్రిలో చెత్తా చెదారం శుభ్రపరిచే వాళ్ళకు అదే ఊరిలో దానవాయి పేటలో భూమి ఇచ్చారు. అంతే కాక కోరుకొండలో జూనియర్ కాలేజీ కట్టించారు. దాని పేరు కూడా ఆయన పేరు మీదే "రాజబాబు జూనియర్ కళాశాల"గా ఉంది. వరుసగా ఏడు సార్లు ఫిలింఫేర్ అవార్డు పొందిన మొట్ట మొదటి హాస్య నటుడు రాజబాబు.

ఆయన జీవితంలో మొత్తం తొమ్మిది ఫిలింమ్ ఫేర్ అవార్డులు, మూడు నంది బహుమతులు, ఎన్నెన్నో అవార్డులు రివార్డులూ పొందారు. "చెన్నై ఆంధ్రా క్లబ్బు" వారు వరుసగా ఐదు సంవత్సరాలు "రోలింగ్ షీల్డు"ని ప్రధానం చేసారు. అంతేకాక శతాబ్దపు హాస్య నటుడిగా అవార్డు పొందారు. రాజబాబుకు ఘంటసాల పాటలంటే ఎంతో ఇష్టం. మహా శివరాత్రి రోజు, ఘంటసాల వర్ధంతి అయిన ఫిబ్రవరి 11 రోజున మొత్తం ఘంటసాల పాటలు వింటూనే ఉన్నారు. అదే రోజు రాత్రి గొంతులో ఏదో ఇబ్బంది వచ్చి హైదరాబాదు లోని థెరెసా ఆసుపత్రిలో చేరాడు. ఆ ఆసుపత్రి లోనే ఫిబ్రవరి 14, 1983 రోజున తెలుగు సినీ అభిమానుల్ని శోక సముద్రంలో ముంచి స్వర్గస్తుదయారు. అనుకరించడానికి అసాధ్యమైన ప్రత్యేకమైన శైలి రాజబాబుది. ఆయన మరణంతో తెలుగు చిత్రసీమకు

# ధీరవనిత సరోజినీ నాయుడు

13 ఫిబ్రవరి 1879న హైదరాబాద్‌లోని బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో డా: అఘోరనాథ్ చటోపాద్యాయ (నిజామ్ కాలేజ్ ప్రిన్సిపల్), బరదా సుందరీ దేవి పుణ్య దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించిన సరోజినీ నాయుడు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, ఆంగ్ల రచయిత్రి, కవయిత్రి, నాయకురాలు, పౌరహక్కుల పరిరక్షకురాలు, మహిళాభ్యు దయ నేత, మేధావి, వక్త, సుస్వర గాయని, బాల మేధావి, పరిపాలనాదక్షురాలు, భారత జాతీయ కాంగ్రేస్ ముఖ్య నాయకురాలుగా మనందరికీ చిరపరిచితురాలే. తన గాత్రానికి ముగ్ధుడైన మహాత్మాగాంధీ సరోజినీ నాయుడిని 'భారత కోకిల (నైటింగేల్ ఆఫ్ ఇండియా)' అని నామకరణం చేశారు. మెట్రిక్యులేషన్‌ను యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, కింగ్స్ కాలేజ్ లండన్, గిర్టన్ కాలేజ్ కేంబ్రిడ్జిల్లో నిజామ్ స్కాలర్‌షిప్‌తో ఉన్నత విద్యను అభ్యసించింది మన సరోజినీ నాయుడు.



1905లో వలసపాలనకు వ్యతిరేకంగా గళమెత్తి, 'స్వరాజ్య' పిలుపుకు ఆకర్షితురాలై గాంధీ అనుచరురాలిగా భారత జాతీయ కాంగ్రేస్ ఉద్యమంలో పాల్గొన్నారు. 1925లో భారత జాతీయ కాంగ్రేస్ ప్రథమ మహిళా అధ్యక్షురాలిగా, 1947లో యునైటెడ్ ప్రావిన్స్ (ప్రస్తుత యూపీ) గవర్నర్‌గా సేవలు అందించారు. బాలలు, దేశభక్తి, ప్రేమరసం, విషాద గీతాల రచయితగా కీర్తిని గడించిన "నైటింగేల్ ఆఫ్ ఇండియా" వైద్యులు డా: పైడిపాటి గోవిందరాజులు నాయుడిని కందుకూరి వీరేశలింగం పంతులు సమక్షంలో 19వ ఏట కులాంతర, ప్రాంతాంతర వివాహమాడి ఆదర్శంగా నిలిచారు. 1915 – 1918 మధ్య మాతృ దేశాన్ని పర్యటించి జాతీయతాభావం, మహిళా వికాసం, సామాజిక అభ్యున్నతి అంశాలలో ప్రసంగించి ప్రజలను చైతన్య పరిచారు. నెహ్రూ, మదన్ మోహన్ మాలవీయ, గోపాలకృష్ణ గోకలే, రబింద్రనాథ్ టాగూర్, అన్నీ బిసెంట్ లాంటి ప్రముఖుల మార్గదర్శకత్వంలో పని చేశారు. 'ఉప్పు సత్యాగ్రహం', 'సహాయ నిరాకరణ', 'క్విట్ ఇండియా' లాంటి ఉద్యమాల్లో ముందు నడిచి 21 నెలలు జైలు పాలైనారు.

సరోజినీ నాయుడు తన 12వ ఏటనే రచనలు ప్రారంభించి మెహర్ మున్నీర్, ది గోల్డన్ త్రిషోల్డ్, ఇన్ ది బజార్స్ ఆఫ్ హైదరాబాద్?, ది ఫాదర్ ఆఫ్ ది డాన్, ది బర్డ్ ఆఫ్ టైమ్, ది బ్రోకెన్ వింగ్స్, ది ఫెదర్ ఆఫ్ ది డాన్, దిస్ప్లెటెడ్ ఫ్లూట్ లాంటి పలు కవితా సంకలనాలు రచించి, చక్కటి స్వరంతో గానం చేశారు. పిల్లల అనాథశ్రమాలు, బాలికల విద్యకు పరితపించి, మహిళోద్ధరణకు కంకనబద్దులై 1917లో భారత మహిళా సంఘం ఏర్పాటు చేశారు. యునివర్సిటీ ఆఫ్ లండన్ రూపొందించిన 150 మంది ప్రపంచ ధీరవనితల జాబితాలో చోటు దక్కించుకున్నారు. కైసర్–ఇ–హింద్? బంగారు పతకం, గూగుల్ డూగుల్, భారత కోకిల లాంటి పురస్కారాలను పొందిన సరోజినీ నాయుడు పేరును 5647 ఉల్క లేదా నక్షత్ర శకలానికి పెట్టడం జరిగింది. ఉర్దూ, తెలుగు, ఆంగ్లం, బెంగాలీ, పార్సీ భాషలు మాట్లాడే సరోజినీ నాయుడు ఆధునిక భారత రూపకర్తల్లో ఒకరుగా సుస్థిర స్థానం దక్కించుకున్నారు. ఐదుగురు పిల్లలకు తల్లి అయిన సరోజినీ నాయుడును మహాత్మా గాంధీ 'చాకోలేట్ వర్ణపు మిక్కీ మౌస్', 'డియర్ బుల్‌బుల్' అనే ముద్దు పేర్లతో పిలిచే వారు. తన 70వ ఏట అనారోగ్యంతో లక్నోలో 02 మార్చి 1949న తుది శ్వాస విడిచారు.

13 ఫిబ్రవరి సరోజినీనాయుడు జన్మదినం సందర్భంగా భారత ప్రభుత్వం 'జాతీయ మహిళా దినం'గా పాటిస్తున్నది. సృష్టిలో సగభాగమైన మహిళా సమాజం పట్ల చిన్న చూపు, లింగ అసమానతల అగాధాలు, మహిళా హక్కుల హననాలు, భ్రూణహత్యలు, గృహ హింసలు, బాల్యవివాహాలు, బాల కార్మికులు, లైంగిక వేధింపులు, మహిళా స్వేచ్ఛ, ఆసిడ్ దాడులు, వరకట్న వేధింపులు, బాలిక అక్రమ రవాణ, మహిళల అవిద్య, అత్యాచార హత్యలు, ఆర్థిక స్వావలంభన లేకపోవడం లాంటి పలు గంభీర సమస్యల పట్ల సంపూర్ణ అవగాహన కలిగించడానికి 13 ఫిబ్రవరి వేదికలను వినియోగిస్తారు. ప్రపంచంలోని 160 దేశాల లింగ అసమానతల సూచికలో భారత్ స్థానం 127 ఉండడం భారతీయ మహిళల దుస్థితికి అద్దం పడుతున్నది. దేశంలో సెకండరీ విద్య పూర్తి చేసిన పురుషులు 63.5 శాతం ఉండగా, మహిళల్లో 39 శాతం మాత్రమే ఉన్నారు.

శ్రామిక లోకంలో పురుషులు 78.8 శాతం ఉండగా, మహిళల్లో 27.2 శాతం కనిపిస్తున్నది. నాగరిక సమాజంలో పిల్లల పెంపకంలో బాలికల పట్ల వివక్ష అధికంగా ఉండడం విచారకరం. పార్లమెంట్‌లో మహిళా ప్రాధాన్యత 14.5 శాతం మాత్రమే ఉండడం గమనార్హం. ఆధునిక యుగంలో మహి ళలు పురుషులతో సమానంగా అంతరిక్షంలో విహరించడం, యుద్ధక్షేత్రాల్లో ధీరవనితలుగా రుజువు చేసుకోవడం, హెలికాప్టర్/విమాన పైలెట్లు లాంటి అన్ని వర్గాల్లో ముందుండి తమ ప్రతిభను ప్రదర్శించడం హర్షదాయకం. నేటి యువతకు, ముఖ్యంగా మహిళలకు ప్రేరణగా నిలుస్తున్న ధీర వనిత సరోజినీ నాయుడు జీవితం మన మహిళామణులకు ప్రేరణ కావాలని, సన్మార్గాన్ని చూపాలని కోరుకుందాం.

# ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన సమ్మక్క సారక్క జాతర

**వరంగల్ :** ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ జాతరకు ఇక కొన్ని రోజుల సమయం మాత్రమే ఉంది. నాలుగు రోజుల పాటు జరిగే ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన సమ్మక్క సారక్క జాతర ఫిబ్రవరి 21 న ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో ప్రారంభమవుతుంది. ఈ పండుగను 1998లో రాష్ట్ర పండుగగా ప్రకటించారు. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాదు దేశ వ్యాప్తంగా భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తుతారు. సుమారు నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరను సుమారు 1.2 కోట్ల మంది భక్తులు సందర్శిస్తారని అంచనా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర , మధ్యప్రదేశ్ నుండి ఎక్కువమంది భక్తులు విచ్చేస్తారు. సమ్మక్క సారలమ్మ లేదా సమ్మక్క సారక్క జాతరను మేడారం జాతర అని కూడా పిలుస్తారు. గిరిజన మహిళలను దేవతలుగా కొలిచే గిరిజన పండుగ. గిరిజనుకు జరుగుతున్న అన్యాయంపై చట్టానికి వ్యతిరేకంగా పాలించిన పాలకులతో తల్లి, కుమార్తె, సమ్మక్క .. సారలమ్మ చేసిన పోరాటాన్ని గుర్తుగా జరుపుకునే పండుగ. కుంభమేళా తర్వాత మేడారం జాతరకు దేశంలోనే అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని ప్రతీతి. గిరిజనుల దేవతలు తమను దర్శించుకుంటారని విశ్వసిస్తూ మేడారంలో జరుపుకుంటారు. ములుగులో మనుగడలో ఉన్న అతిపెద్ద అటవీ ప్రాంతం అయిన దండకారణ్యంలో భాగమైన ఏటూరునాగారం వన్యప్రాణుల అభయారణ్యంలోని మారుమూల ప్రాంతం మేడారం. సుమారు 6-7 శతాబ్దాల క్రితం అంటే 13వ శతాబ్దంలో వేటకు వెళ్లిన కొంతమంది గిరిజన నాయకులు పులుల మధ్య అపారమైన కాంతిని వెదజల్లుతున్న నవజాత బాలిక (సమ్మక్క)ను కనుగొన్నారని స్థానికుల కథనం. ఆమెను తమ నివాసానికి తీసుకెళ్లారు. ఆ తెగ పెద్ద ఆమెను దత్తత తీసుకుని అధిపతిగా పెంచాడు. ఆమె కాకతీయుల గిరిజన నాయకుడు పగిడిద్ద రాజుతో వివాహం జరిగింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు.. సారక్క, నాగులమ్మలతో పాటు జంపన్న అనే ఒక కుమారుడు ఉన్నారు. కన్నెపల్లి గ్రామం నుంచి మేడారం వేదికపై ఉంచిన సారక్క చిత్రపటం ఆనవాయితీగా రావడంతో జాతరకు శ్రీకారం చుట్టారు. ఎర్రటి వస్త్రంతో కప్పబడిన చిత్ర విగ్రహానన్నీ పసుపు కుంకుమలతో నింపిన పాత్రలో పెట్టి తీసుకువచ్చారు. గిరిజన పూజారులు మేడారం నుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లిలో ఒక చిన్న ఆలయంలోకి ప్రవేశించడంతో ప్రత్యేకమైన ఆచారాలు ప్రారంభమయ్యాయి. వారు ఆలయం నుండి బయటకు వచ్చే ముందు దేవతను ప్రార్థిస్తూ గంటల తరబడి ప్రార్థనలు చేస్తారు. గిరిజన పూజారులు, జిల్లా అధికారుల బృందం దేవతకు సాంప్రదాయాన్ని అనుసరిస్తూ పూజలు చేస్తారు. భక్తులు తమ బరువుకు సమానమైన బంగారం (బెల్లం)ను అమ్మవారికి సమర్పించి జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇది వైదిక లేదా బ్రాహ్మణ ప్రభావం లేని పూర్తిగా గిరిజన పండుగ.




**జంపన్న వాగు**

జంపన్న వాగు గోదావరి నదికి ఉపనది. పురాణాల ప్రకారం జంపన్న గిరిజన యోధుడు. గిరిజన దేవత సమ్మక్క కుమారుడు. ఆ ప్రవాహంలో కాకతీయ సైన్యంతో జరిగిన యుద్ధంలో మరణించినందున జంపన్న వాగు అతని పేరుతో ఖ్యాతి పొందింది. జంపన్న వాగు ఇప్పటికీ జంపన్న రక్తంతో ఎర్రగా ఉందని భక్తుల నమ్మకం. జంపన్న వాగులోని ఎర్రటి నీటిలో పుణ్యస్నానం చేయడం వల్ల తమను సదా రక్షిస్తాడని విశ్వాసం. వారి త్యాగం తమ హృదయానికి ధైర్యం నింపుతుందని గిరిజనులు నమ్ముతారు. జంపన్న వాగు పైన నిర్మించిన వంతెనను జంపన్న వాగు వంతెన అని పిలుస్తారు. ఈ ఏడాది టీఎస్ఆర్టీసీ 30 లక్షల మంది ప్రయాణికులను చేరవేసేందుకు 6,000 ప్రత్యేక బస్సులను మేడారం జాతరకు నడపనుంది. ఈ బస్సులు ఫిబ్రవరి 18 నుండి 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా 51 పాయింట్ల నుండి నడపబడతాయి. ఇటీవల రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ , సీతక్క తాడ్వాయిలోని టిక్కెట్ కౌంటర్లను సందర్శించి సన్నాహాలను సమీక్షించారు. మహిళల కోసం కొనసాగుతున్న ఉచిత బస్సు సర్వీసు జాతరకు ప్రత్యేక బస్సులకు వర్తిస్తుందని టీఎస్ఆర్టీసీ ప్రకటించింది. ఫిబ్రవరి 2 నుండి 29 వరకు సమ్మక్క సారక్క జాతర (మేడారం జాతర)కు వెళ్లే సమయంలో ఏటూరు నాగారం రిజర్వ్ ఫారెస్ట్ గుండా వెళ్లే అన్ని వాహనాలకు పర్యావరణ పన్ను నుంచి మినహాయింపు నిచ్చారు. చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఇది ఉచిత ట్రాఫిక్‌ను సులభతరం చేస్తుంది. మేడారం జాతరకు చేరుకోవడానికి భక్తులకు అదనపు డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా సహాయపడుతుంది. పస్రా, తాడ్వాయి, ఏటూరునాగారం ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల నుంచి అటవీశాఖ నామమాత్రపు రుసుము వసూలు చేస్తోంది. సేకరించిన మొత్తాన్ని రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణులను రక్షించడానికి.. వన్యప్రాణులకు ప్రమాదం కలిగించే ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను సేకరించడానికి ఉపయోగించనున్నారు. అయితే జాతర సమయంలో వాహనాలకు రుసుము చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వానికి మినహాయింపు ఇవ్వాలని భక్తులు అభ్యర్థిస్తున్నారు. భక్తులు అమ్మవారికి 'బంగారం'గా సమర్పించే బెల్లం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ఈసారి ఆధార్ నిబంధనను అమలు చేయాలని నిర్ణయించింది. బెల్లం సమర్పించాలనుకునే భక్తులు తమ ఆధార్ జిరాక్స్ కాపీని కౌంటర్లలో సమర్పించాలి. భక్తులు తమ పేరు, ఫోన్ నంబర్, బెల్లం కొనుగోలు ఉద్దేశం తదితర వివరాలను తప్పనిసరిగా అందించాలని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. ఎక్సైజ్ సిబ్బంది డేటాను క్రోడీకరించి ప్రతిరోజూ జిల్లా స్థాయి అధికారులకు సమర్పించాలి. జాతర సమయంలో లేదా ఆ తర్వాత మేడారం వెళ్లలేని వారి కోసం ఆన్‌లైన్‌లో చెల్లింపు సౌకర్యాన్ని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. దేవతలకు భక్తితో నైవేద్యంగా తమ శరీర బరువుకు సమానమైన బెల్లాన్ని బంగారంగా సమర్పిస్తారు. మీ సేవ, ట్యాప్ , పోస్టల్ డిపార్ట్‌మెంట్ కి 1.5 లక్షల అవుట్‌లెట్‌ల ద్వారా భక్తులు తమ శరీర బరువు ఆధారంగా బెల్లాన్ని చెందిన మొత్తాన్ని చెల్లించవచ్చు. జాతరకు గిరిజనుల ఆచారాల ప్రకారం పూర్తి ఏర్పాట్లు చేయాలని సీపీఐ మావోయిస్టు జయశంకర్, ములుగు, వరంగల్, పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్ బహిరంగ లేఖలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేడారంలో భక్తులకు ప్రసాదంగా లడ్డూ లేదా పులిహోర వంటి వాటిని పంపిణీ చేయవద్దని.. బంగారాన్నిమాత్రమే పంపిణీ చేయాలంటూ మావోయిస్టులు హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో పరిశుభ్రత పాటించాలని, జాతర నిర్వహణ కోసం చేసిన ఏర్పాట్లతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని మావోయిస్టులు డిమాండ్ చేశారు.

# ఆపరేషన్ ఆకర్ష్‌లో పార్టీలు

**కరీంనగర్ :** బీఆర్ఎస్ నేతల సెకండ్ క్యాడర్ చేరికలపై ఫోకస్ పెట్టింది కాంగ్రెస్. ఘర్ వాపసీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బడా నేతల కంటే.. సెకండ్ క్యాడర్ నేతలపైనే ఎక్కువ దృష్టి పెట్టింది. ఇప్పటికే పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ పదిహేను రోజులలో భారీ చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2014 కంటే ముందు కాంగ్రెస్ బలంగా ఉండేది. ప్రతి గ్రామంలో బలమైన క్యాడర్ ఉండేది. అయితే 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో పాటు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయంగా అనేక మార్పులు జరిగాయి . ఈక్రమంలోనే కాంగ్రెస్ నుండి పెద్ద ఎత్తున బీఆర్ఎస్?కి వలసలు పెరిగాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం?పై తీవ్రమైన వ్యతిరేకత ఉన్న కారణంగా ప్రజలు కాంగ్రెస్?కి ఓట్లు వేసారు. అయితే పార్టీ?ని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టింది కాంగ్రెస్. గతంలో బీఆర్ఎస్?కి వెళ్ళిన వారిని తిరిగి కాంగ్రెస్?లోకి తీసుకుంటుంది. పార్లమెంటు ఎన్నికల కంటే ముందే ఈ అపరేషన్?ని మొదలు పెట్టనుంది. ప్రభుత్వం ఏర్పాటు తరువాత ఇప్పటికే కొంత మంది ముఖ్య నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎంపి ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలోనే బలమైన క్యాడర్ కోసం చేరికలని ప్రోత్సహిస్తుంది కాంగ్రెస్. కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఎర్పడినప్పటి నుంచి ఆ పార్టీ బలంగా ఉంది.



ఆ పార్టీకి మళ్ళీ అవకాశం ఇవ్వకుండా గ్రామస్థాయిలో కాంగ్రెస్ పటిష్టమైన క్యాడర్ నిర్మించుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మురం చేసింది. ఇప్పటికే పలు అవిశ్వాలు పెట్టి బీఅర్ఎస్?పై పైచేయి సాధించింది. చాలా మున్సిపాలిటీల నుండి బీఅర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. జమ్మికుంటలో ఏకంగా పదమూడు మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చొప్పదండి, మానకొండూర్, వేములవాడ తదితర అసెంబ్లీల నుంచి బీఆర్ఎస్ క్యాడర్ కాంగ్రెస్?లో చేరుతున్నారు. కరీంనగర్ పార్లమెంటు ఎన్నికలలో విజయం సాధించాలంటే గ్రామస్థాయిలో పటిష్టంగా ఉండాలని చేరికలని ప్రోత్సహిస్తున్నారు. ఈ పదిహేను రోజులలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజకీయాల సమీకరణాలు వేగంగా మారనున్నాయి.

## పారాగ్లైడింగ్ ప్రమాదంలో తెలంగాణ యువతి మృతి

**హైదరాబాద్ :** పారాగ్లైడింగ్ సరదా ఓ యువతి నిండు ప్రాణాలను బలితీసుకుంది. పైలట్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదవశాత్తు వందల అడుగుల పైనుంచి కిందకుపడి ప్రాణాలు విడిచింది. హిమాచల్ ప్రదేశ లోని కులూలో జరిగిన ఈ ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువతి కన్నుమూసింది. గాల్లో చక్కర్లు, వందల అడుగుల ఎత్తులో విహారం, దూదిపింజలా తేలిపోతున్న శరీరం. ఇవన్నీ మాటల్లో చెబితే సరిపోదు పారాగ్లైడింగ్అనుభవించి తీరిన వారికే అర్థమవుతుంది. ఎత్తైన కొండల మీద నుంచి లోయలోకి దూకడం, ఎగిరే విమానం డోరు తెరుచుకుని బయటకు దూకేయడం వంటివి మనం సినిమాలో చూస్తుంటాం. ఆ వెంటనే గొడుగు వంటి పరికరం తెరుచుకుని గాల్లో అలా అలా విహరిస్తుంటారు. దీన్నే పారాగ్లైండింగ్() అంటారు. ఈ ఆట ఎంత సరదాగా ఉంటుందో అజాగ్రత్తగా ఉంటే అంతకన్నా ప్రమాదకరంగా ఉంటుంది. ఊపిరి సినిమా చూశాం కదా..అందులో నాగార్జున వందల అడుగుల ఎత్తు నుంచి పడిపోయి ఎలా జీవచ్ఛవంలా మారిపోయాడు. వందలకోట్లు ఉండి కూడా చక్రాల కుర్చీకే పరిమితమయ్యాడు. కనీసం అక్కడ నాగార్జున బ్రతికే ఉన్నాడు. కానీ కొంతమంది అక్కడికక్కడే మృతిచెందుతారు. సరిగ్గా అలాంటి ఘటనలే హిమాచల్ ప్రదేశ్ లోని కులూలో జరిగింది. తెలంగాణలోని జహీరాబాద్ కు చెందిన హైదరాబాద్ కు చెందిన ఓ మహిళా పర్యాటకురాలు ప్రమాదవశాత్తూ మృతి చెందారు. పారాగ్లైడింగ్ ప్రమాదంలో హిమాచల్ ప్రదేశ్ లోని కులులో ఈ ఘటన జరిగింది. తెలంగాణలోని జహీరాబాద్ కు చెందిన నవ్య పారాగ్లైడింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు గాల్లో నుంచి కిందపడిపోయి కన్నుమూసింది. సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్న మోహన్, నవ్య దంపతులు విహారయాత్ర కోసం హిమాచల్ ప్రదేశ్ లోని కులూ వెళ్లారు. నవ్య పారాగ్లైడింగ్ చేస్తుండగా పైలట్)అజాగ్రత్తగా వ్యవహరించి సీట్ బెల్ట్ సరిగా పెట్టుకోకపోవడంతో ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయింది. నవ్య ప్రమాదానికి గురైన ప్రాంతం పారాగ్లైడింగ్ కు ఎంతో అనువైన ప్రదేశమే. వందల మంది యాత్రికులు ఇక్కడ గాల్లో విహరించి ఆనందం పొందారు. అయితే కేవలం మానవ తప్పిదం వల్లే ఈ ప్రమాదం జరిగిందని కులూ పోలీసులు నిర్ధరించారు. పైలట్ టూరిస్ట్ సేఫ్టీ బెల్ట్ సరిగా పెట్టుకోకపోవడం వల్ల నవ్య జారికిందపడిపోయిందని తెలిపారు. పారాగ్లైడింగ్ కు అన్ని సేఫ్టీ మెజర్ మెంట్స్ ఉన్నాయని....పైలట్ కూడా పారాగ్లైడింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవాడేనని తేల్చారు. అయితే అజాగ్రత్తే పర్యాటకురాలి ప్రాణాలు తీసిందని వారు తెలిపారు.

## దొంగ హామీలిస్తున్న చంద్రబాబు

**పెనమలూరు :** పెనమలూరు నియోజకవర్గం పోరంకిలో వైఎస్సార్ ఆసరా 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ మంచి చేస్తున్నాడు కాబట్టే ప్రజల మనసుల్లో జగన్ స్తానం సంపాదించారన్నారు .చంద్రబాబు నాయుడు ఒంటరిగా పోటీ చెయ్యలేక తన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ను వెంటేసుకుని తిరుగుతున్నాడు. చంద్రబాబు ఇంటింటికి కిలో బంగారం,బెంజ్ కారు అంటూ దొంగహామీలు ఇస్తున్నాడు . 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు నాయుడు రైతులను,నిరుద్యోగులను,డ్వాక్రా మహిళలను మోసం చేసాడు. 2014 ఎన్నికల్లో ఇదే చంద్రబాబు దత్తపుత్రుడు బీజేపీ కలిసి పోటీ చేశారు. ఇప్పుడేదో కొత్తగా వస్తున్నట్టు కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారు. ప్రతి ఒక్కరు సైనికుల్లా జగన్మోహన్ రెడ్డి గెలుపుకు కృషి చెయ్యాలి అని పిలుపు ని ఇచ్చారు. ముఖ్యమంత్రి అయిన దగ్గరనుంచి జగన్ 124 సార్లు బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేశారు. మీరు కేవలం 2సార్లు బటన్ నొక్కి వైసీపీ ఎమ్మెల్యే ని, ఎంపీని గెలిపించాలి అని కోరారు.

## దిల్ సుఖ్ నగర్‌లో యువకుడిపై హత్యా యత్నం

**హైదరాబాద్ :** శ్రీనివాస్, జమీల్ ఇద్దరు స్నేహితులు. ఇద్దరు కలిసి మద్యం తాగారు. స్వల్ప వివాదం జరిగింది. సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి మేఘా టాకీస్ వద్ద మద్యం సిసాను పగులకొట్టి శరీరంలోని వివిధ భాగాల్లో దాడి చేశాడు. తప్పించుకుని వచ్చిన శ్రీనివాస్ చర్మాస్ వద్ద పడిపోయాడు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న చాదర్ ఘాట్ పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ కు వైద్యం అందిస్తున్నారు.

## గంగవరం పోర్టు కార్మికుడు మృతి బంధువుల అందోళన

**గాజువాక :** విశాఖ జిల్లా ఆదాని గంగవరం పోర్టు కార్మికుడు గండేపల్లి అప్పారావు (43) కడుపు నొప్పితో అనారోగ్యంతో చనిపోయాడు. మృతదేహంతో అప్పారావు బంధువులు అదాని గంగవరం పోర్టు గేటు వద్ద నిరసన తెలిపారు. భారతదేశంలో ఉన్న అన్ని కంపెనీ లోను ఒక ఆసుపత్రి ఉంటుందని, కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు కార్మిక కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందిస్తారని, కానీ ఇక్కడ అదానీ గంగవరం పోర్ట్ కు సంబంధించి ఎటువంటి ఆసుపత్రి లేదని అన్నారు. దీనివల్ల గంగవరం పోర్ట్ నుంచి వస్తున్న కాలుష్యం వలన గంగవరం గ్రామంస్తులు అనారోగ్యానికి గురవుతున్నారని, గంగవరం గ్రామస్తులు భూములు ఇచ్చి, సముద్రాన్ని ఇచ్చి జీవితాలు త్యాగం చేస్తే చాలీచాలని జీతాలతో మా బ్రతుకులతో ఆదాని గంగవరం పోర్టు యాజమాన్యం ఆడుకుంటుందని, ఎన్నిసార్లు ధర్నాలు చేసిన పట్టించుకోవడంలేదని, వాపోయారు. వెంటనే యాజమాన్యం స్పందించి చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని అన్నారు.

## ఎల్బీనగర్‌లో జీహెచ్ఎంసి కమిషనర్ పర్యటన

**హైదరాబాద్ :** ఎల్బీ నగర్ నియోజకవర్గం లో జీహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ మంగళవారం పర్యటించారు. వరద ముంపు ప్రాంతాల్లో సాగుతున్న నాలా పనులను పరిశీలించారు. సరూర్ నగర్ చెరువు ముంపు ప్రాంతాలైన తపోవన్ కాలనీ, గ్రీన్ పార్క్ కాలనీ వాసులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి, జోనల్ కమిషనర్ పంకజ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్డీయే కూటమిలోకి మరిన్ని పార్టీలు

**బెంగళూరు :** రుణ శేషం.. శత్రుశేషం ఉండకూడదు అంటారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అలాంటి అంచనానే వేసుకున్నట్టున్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగానే గత రెండు పర్యాయాలు లేని విధంగా పొత్తులకు శ్రీకారం చుడుతున్నారు. అనేక సర్వే సంస్థలు బిజెపి సొంతంగా 370 స్థానాలు గెలుచుకుంటుందని చెబుతున్నప్పటికీ నరేంద్ర మోడీబి అమిత్ షా ద్వయం ఊరుకోవడం లేదు. జమ్మూ కాశ్మీర్ నుంచి మొదలుపెడితే తమిళనాడులోని రామేశ్వరం వరకు ప్రతి ప్రాంతం పైన అత్యంత సీరియస్ గా దృష్టి సారించారు. "బలం ఉన్నచోట మరింత బలం పెంచుకోవడం.. బలం లేనిచోట బలాన్ని పెంచుకోవడం.." ఇదే సూత్రాన్ని అవలంబిస్తున్నారు. ఈ క్రమంలోనే సరికొత్త పొత్తులకు.. కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసే ఎత్తులు వేస్తున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాష్ట్రీయ లోక్ దళ్ ఇండియా కూటమి నుంచి బయటికి వచ్చింది. ఎన్నికల్లో నరేంద్ర మోడీకి మద్దతు ఇస్తామని ప్రకటించింది. రెండవ మాటకు తావు లేకుండా ఎన్డీఏలో చేరుతున్నామని ప్రకటించింది. వాస్తవానికి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బిజెపికి విపరీతమైన బలం ఉంది. దానికి ఆ రాష్ట్రంలో ఇంకో పార్టీ అవసరం లేదు. కానీ రాష్ట్రీయ లోక్ దళ్ వస్తాను అని చెప్పగానే వెల్కం అంటూ చేర్చుకుంది. అక్కడ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రీయ లోక్ దళ్ సహాయంతో కొన్ని సీట్లయినా గెలుచుకోవాలని భావించింది. కానీ కాంగ్రెస్ పార్టీ అలా సీట్లు గెలుచుకుంటే మొదటికే మోసం వస్తుందని నరేంద్ర మోడీబి అమిత్ షా ద్వయం భావించి దానికి ఆస్కారం లేకుండా ఉండేందుకు పావులు కదిపారు. రాష్ట్రీయ లోక్ దళ్ ను ఎన్డీఏ కూటమిలో చేర్చుకున్నారు. కేవలం ఈ పార్టీ మాత్రమే కాదు కర్ణాటక కు చెందిన జనతా దళ్ యూనియన్ ఎన్డీఏ కూటమిలో చేరింది. గత ఎన్నికల్లో అక్కడ బిజెపి ఓడిపోయిన నేపథ్యంలో.. ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అక్కడ మెరుగైన స్థానాలు గెలుచుకోవాలని భావిస్తుంది. ఇందులో భాగంగానే కుమారస్వామి పార్టీకి ఆఫర్ ఇచ్చింది. స్వామి కూడా పోలోమంటూ ఎన్డీఏ కూటమిలో చేరారు. కేంద్రంలో ఈ దఫా కూడా అధికారంలోకి వస్తుంది అనే సానుకూల వార్తలు వినిపిస్తున్నప్పటికీ.. బిజెపి ఏ అవకాశాన్ని కూడా అంత సులభంగా వదులుకోవడం లేదు. ఎందుకంటే ఈసారి కాంగ్రెస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేయాలని భావిస్తున్నది. ఈ సారి ప్రభుత్వం ఏర్పడితే మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటామని నరేంద్ర మోడీ ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి ఇబ్బంది రాకుండా ఉండాలి అంటే ప్రతిపక్ష పార్టీల ముందరికాళ్ళకు బంధం వేయాలని బిజెపి భావిస్తోంది. ఈ క్రమంలోనే ఇండియా కూటమిలో లుకలుకలను తనకు అనుకూలంగా మలుచుకుంటున్నది. కాంగ్రెస్ పార్టీని ఒంటరిని చేసి 400కు పైచిలుకు స్థానాలను గెలుచుకుని మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాలని యోచిస్తోంది.. "ప్రతిపక్షాలు ఎక్కువ స్థాయిలో ఉంటే మాకు చాలా ఇబ్బంది. అవి మా చెవులను ఇబ్బంది పెడుతూనే ఉంటాయని" గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన తోమర్ పార్లమెంట్ లో వ్యాఖ్యానించారు. అప్పట్లో ఆయన ఊరకనే ఆ వ్యాఖ్యలు చేశారని అందరూ అనుకున్నారు. కానీ ఆ వ్యాఖ్యల వెనుక నరేంద్ర మోడీ ఉన్నారని ఎవరూ ఊహించలేదు.. కాంగ్రెస్ ను సాధ్యమైనంత వరకు నిర్వీర్యం చేసి.. తమకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే పొత్తుల వెనుక పరమార్థం లాగా కనిపిస్తోంది. ఆ మధ్య "కుటుంబ నియంత్రణ అనేది వ్యక్తులకే.. రాజకీయ పార్టీలకు కాదు.. ఎంతమంది ఉంటే అంత బలం అని" అమిత్ షా వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితులు నాడు ఆయన చేసిన వ్యాఖ్యలకు అద్దం పడుతున్నాయి.

## నదీ జలాలపై కేంద్ర పెత్తనం ఒప్పుకోం

**హైదరాబాద్ :** తెలంగాణ నదీ జలాల పైన కేంద్రం పెత్తనానికి దాసోహమన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ మంగళవారం నల్లగొండలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు పార్టీ బృందం బయలుదేరింది. పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ నుంచి చలో నల్గొండ బహిరంగ సభకు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడారు ఈ రోజు పార్టీ ప్రజా ప్రతినిధులను సీనియర్ నాయకులను అంత నల్గొండ బహిరంగ సభకు బయలుదేరి వెళుతున్నాము. తెలంగాణ నదీ జలాల పైన కేంద్రం పెత్తనాన్ని గత పది సంవత్సరాలుగా అడ్డుకున్నది మా పార్టీ ప్రభుత్వం. నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాత్రం కేవలం రెండు నెలల్లోని కృష్ణ గోదావరి నది జలాల బోర్డులకు నదుల నిర్వహణను అప్పజెప్పిందని అన్నారు.

## వెంకటేశ్వర స్వామి దేవస్థానం జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు




**వాస్తవ నేస్తం,కుత్బుల్లాపూర్:** జగద్గిరిగుట్ట 126 డివిజన్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానం నందు జరుగుతున్న జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యేలు కేపీ.వివేకానంద, మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, బిఆర్ఎస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంటరీ నియోజకవర్గం సీనియర్ నాయకులు డాక్టర్ భద్రారెడ్డి పరిశీలించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట ప్రాంతంలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి మహిమలు అపురూపమని గత 53 సంవత్సరాలుగా నిర్విరామంగా కొనసాగుతున్న జాతరను ఈ యేడు కూడా ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బాబు గౌడ్, వెంకటేష్, మనోజ్, గుబ్బల లక్ష్మీనారాయణ, సయ్యద్ సాజిద్, నర్సింగ్, పాపులు గౌడ్, గిరిబాబు, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, కమిటీ సభ్యులు పాపిరెడ్డి, రేగురి ప్రవీణ్ కుమార్ గుప్త, సమ్మయ్య యాదవ్, బండ అనిత మహేష్, మహేష్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై మేయర్ సమీక్ష సమావేశం



**వాస్తవ నేస్తం,కుత్బుల్లాపూర్:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన కమీషనర్ రామకృష్ణ రావు, ఎస్. ఈ సత్యనారాయణ తో కలిసి ఎన్ఎంసి ఆయా విభాగాల అధికారులతో నేడు సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు, పెండిగ్ లో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులు, కావాల్సిన నిధులు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి చర్చా సమావేశం నిర్వహించడం జరిగింది. భాగంగా మేయర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి, పెండింగ్ దశలో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదే విధంగా కార్పొరేషన్ పరిధిలో రోడ్లు,డ్రైనేజ్ లు, పార్క్ ల అభివృద్ధి,ట్రాఫిక్ ఇబ్బందులు నియంత్రణ రోడ్ ప్యాచ్ వర్క్స్, విద్యుత్ తీగలకు అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలు, వాటి తొలగింపు, లేక్ డెవలప్మెంట్, ఫుట్ పాత్ ల పై అక్రమ షాపులు, పండ్లు, ఇతర బండ్ల తొలగింపు, ప్లాస్టిక్ కవర్ల నిషేదం తగు చర్యలు, వంటి విషయాలపై ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ , శానిటేషన్, ఎలక్ట్రికల్, హార్టికల్చర్,ఆయా విభాగాల అధికారులతో చర్చించి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్, ఎన్ఎంసి ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడు విల్సన్ మృతి



**వాస్తవ నేస్తం,కోదాడ:** విశ్రాంత ఉపాధ్యాయుడు లాం విల్సన్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు ఆయన ఉపాధ్యాయుడిగా కోదాడ తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అందరూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది ఉత్తమ జిల్లా రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకొని మన్ననలు పొంది నారు ఆయన ఉద్యోగ కాలం మొత్తం పిఆర్ టి యు సంగం లో కొనసాగారు ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఒక కుమారుడు విద్యుత్ శాఖలో హైదరాబాదులో డి ఈ గా మరో కుమారుడు ఉపాధ్యాయుడిగా జిల్లా సైన్స్ అధికారిగా పనిచేస్తున్నారు ఇద్దరు కోడలు ఉపాధ్యాయులు గా పని చేస్తున్నారు వి ల్సన్ సార్ మృతి పట్ల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాజీ ఎమ్మెల్యే చందర్రావు ముత్తవరపు పాండురంగారావు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి వంగవీటి రామారావు పారా సీతయ్య వెంకటరత్నం బాబు స్థానిక కౌన్సిలర్ బత్తిని హనుమంతరావు దండ వీరభద్రం పి ఆర్ టి యు నాయకులు రావెళ్ల సీతారామయ్య బొల్లు రాంబాబు తో పాటు విద్యుత్ శాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## భాగం సేవ ఫౌండేషన్ విద్యార్థులకు చేయూత



**వాస్తవ నేస్తం,బోనకల్:** భాగం సేవ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తుంది. దీనిలో భాగంగా సేవ ఫౌండేషన్ నిర్వాహకులు ఎన్ఆర్ఐ భాగం రాకేష్ మండల పరిధిలోని చిన్న మండవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం నిమిత్తం సేవ ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా సేవా ఫౌండేషన్ సభ్యులు రాధాకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఫౌండేషన్ తరపున సహాయం చేస్తామన్నారు. భాగం సేవ ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న నిర్వాహకులు భాగం రాకేష్ ను గ్రామస్తులు పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగం పాపారావు బాగం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ధర్మరాజు ఖాన్ సైదులు గ్రామ పెద్దలు పరచగాని వెంకట రాములు , రమేష్ ఆత్మకూరు రవికుమార్, పూర్వ విద్యార్థుల రాంబాబు సతీష్ జానీ తదితరులు పాల్గొన్నారు.

# మరో వివాదంలో ముత్తిరెడ్డి

**కరీంనగర్ :** అధికారంలో ఉన్నా లేకపోయినా వివాదాలు మాత్రం ఆ నేతను నీడలా వెంటాడుతున్నాయి. నాడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు స్వంత కూతురితో విమర్శలు ఎదుర్కొన్న నేత ఇప్పుడు తాజాగా మరో వివాదంలో జనంలో చర్చగా మారారు. వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిత్యం వార్తల్లో నిలిచే జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఇప్పుడు మరో వివాదంతో హాట్ టాపిక్ అయ్యాడు. ఇంతకీ వివాదానికి కారణం ఏంటంటే..?జనగామలోని బతుకమ్మకుంట పార్క్ ముఖద్వారానికి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పేరు పెట్టారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ బతుకమ్మ కుంట పార్క్ విషయంలో చిన్నపాటి యుద్ధమే జరిగింది. ముత్తిరెడ్డి పట్టుబట్టి మరీ ఇక్కడ పార్క్ నిర్మించారు. పార్క్ ఎంట్రెన్స్ లో నిర్మించిన ముఖద్వారానికి అప్పుడున్న అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పేరు పెట్టారు. శిలాఫలకంలో పేరు పెట్టడం కామన్? కానీ ఏకంగా ముఖ ద్వారంపై బారీ అక్షరాలతో నేమ్ ఏర్పాటు




చేశారు. ఆయన ఎమ్మెల్యే గా ఉన్నంత కాలం ఎవరూ విమర్శించ లేదు.. తాజాగా ముత్తిరెడ్డి నేమ్ బోర్డ్ పై విమర్శలు వెల్లువెత్తాయి..ముఖద్వారంపై ఆయన పేరు ఉండడం పట్ల రాజకీయ ప్రత్యర్థుల నుంచి విమర్శలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రజాధనంతో నిర్మించిన బతుకమ్మకుంట ముఖద్వారానికి మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పేరు ఉండడం ఏంటని ప్రజలు ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే పేరును కొనసాగింపుపై అభ్యంతరాలు రావడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. ముఖద్వారానికి ఏర్పాటుచేసిన మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి నేమ్ తొలగించి వివాదానికి తెరదించారుఅయితే ఇదంతా రాజకీయ కక్ష సాధింపు చర్యలని ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అభిమానులు ఆరోపిస్తున్నారు. తనపై ఎన్ని నిందలు వచ్చినా సహించి ప్రజల కోసం.. జనగామకు ఒక మంచి పార్క్ ఉండాలనే సంకల్పంతో ముందుపడి బతుకమ్మకుంట పార్క్ నిర్మించిన ముత్తిరెడ్డి పై విషం చిమ్ముతున్నారని ఆరోపిస్తున్నారు.వరుస వివాదాల కారణంగా గత ఎన్నికల్లో ముత్తిరెడ్డికి బీఆర్ఎస్ అధిష్టానం ఎమ్మెల్యే టిక్కెట్ నిరాకరించింది. ఆయన స్థానంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి విజయం సాధించారు.

# ఒంటరిగా కలవొద్దు

**హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ తెలంగాణ రాజకీయాలు ఆసక్తిగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన బీఆర్ఎస్ కనీసం లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ గెలుపు సాధించాలని వ్యూహాలు రచిస్తోంది. బీఆర్ఎస్ ఈ హడావుడిలో ఉండగా నేతలు కాంగ్రెస్ గూటికి క్యూ కడుతున్నారు. బీఆర్ఎస్‌ను పార్టీని వదిలి కాంగ్రెస్‌లోకి చేరుతున్నారు. మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని డైరెక్ట్ కలుస్తున్నారు. కానీ పార్టీ మారడం లేదు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. అధిష్టానానికి చెప్పకుండా రేవంత్ రెడ్డితో కలవద్దని కేసీఆర్ పార్టీ శ్రేణులను హెచ్చరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అయిన అధినేత సూచనలు కొందరు తుంగలో తొక్కి సీఎంను కలుస్తున్నట్లు సమాచారం. మరి రేవంత్‌తో ఎమ్మెల్యేల భేటీలు, లోకల్ స్థాయి కీలక నేతల నుంచి ముఖ్యనేతల వరకు కొందరూ కాంగ్రెస్‌లో చేరడం గులాబీ బాస్ వ్యూహంలో భాగమా? లేక నిజంగానే కేసఆర్‌కు షాక్ ఇచ్చారా? అని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే అసెంబ్లీలో పరాజయం తర్వాత మాజీ సీఎం కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించడం కోసం కోవర్టు ఆపరేషన్ లాంటిది ఏమైనా స్టార్ట్ చేశారా? అనేది పొలిటికల్ సర్కిల్లో టాక్ నడుస్తోందిఇటీవల పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి తెలంగాణ భవన్‌లో అధినేత కేసీఆర్ అడుగపెట్టి నేతలతో సమీక్షించిన రోజే ఈ పరిమాణం చోటుచేసుకోవడం గమనార్హం. తాజాగా గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన కేటీఆర్ ప్రధాన అనుచరుల్లో ఒకరైనా మాజీ డిప్యూటీ మేయర్, ప్రస్తుత బోరబండ కార్పోరేటర్ బాబా ఫసియుద్దీన్ హస్తం తీర్థం పుచ్చుకున్నారు. సీనియర్ నేత జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆదివారం సీఎంతో భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లోకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తోంది.



మరోనేత నీలం మధు ముదిరాజ్ కాంగ్రెస్‌లోకి చేరనున్నట్లు తెలిసింది.గతంలోనే సీనియర్ నేత, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పాలనుకున్నారు. మహబూబ్ నగర్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కీలక నేత మన్నె జీవన్ రెడ్డితో ఆ జిల్లా నేతలు హస్తం గూటికి చేరారు. పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు మొదలైనాయి. ఈ క్రమంలోనే పలు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పాలన పోయి, కాంగ్రెస్ కార్పొరేటర్లు చైర్మన్లుగా విజయం సాధించారు. దీంతో లోకల్‌లో ఉండే కీలక నేతలు సైతం కాంగ్రెస్‌లోకి జంప్ అవుతున్నట్లు సమాచారం.బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, అతని భార్య జడ్పీ చైర్‌పర్సన్ సునిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. వారు దాదాపు పార్టీలో చేరడం ఖరారు అయ్యిందని టాక్ నడుస్తోంది. ముఖ్యంగా ఒకే సారి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎంను కలిశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు కూడా కొద్ది రోజుల క్రితం రేవంత్ రెడ్డిని కలిశారు. మరోవైపు వారు కాంగ్రెస్ పార్టీలో చేరడం లేదని తెలిపారు. మరోవైపు సీఎంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కూడా కలిశారు. సీఎంను కలిశాక ఆయన బీఆర్ఎస్ సమావేశానికి డుమ్మా కొట్టారు. కానీ నిధుల విషయంలో సీఎంను కలిశానని చెప్పుకొచ్చారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డిని వరుసగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు కలవడం బీఆర్ఎస్‌లో అలజడి మొదలైంది

# నీళ్లు... లెక్క తేలేనా

**హైదరాబాద్ :** కృష్ణా నది పై నిర్మించిన ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే విషయంలో జరుగుతున్న గొడవ తారాస్థాయికి చేరింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి పోటాపోటీగా విమర్శలు చేసుకుంటున్నాయి. కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తామని గత ప్రభుత్వం చెప్పిందని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానది ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తున్నదని భారత రాష్ట్ర సమితి విమర్శిస్తోంది. ఈ నేపథ్యంలో కృష్ణ నది ప్రాజెక్టులపై వాస్తవాలు అనే పుస్తకాన్ని ప్రభుత్వం శాసనసభ వేదికగా సోమవారం ఆవిష్కరించింది. అయితే ఈ పుస్తకం పై నీటిపారుదల శాఖ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు స్పందించారు. శాసనసభ వేదికగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ఆయన పూర్తిగా ఖండించారు. " రెండవ అపెక్స్ కమిటీ మీటింగ్లో కృష్ణా నది నీటి ప్రాజెక్టులను కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డుకు అప్పగించేందుకు గత ప్రభుత్వం ఒప్పుకున్న విషయం అర్థరహితం. దీనికి ప్రస్తుత ప్రభుత్వంలోని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా రాసిన లేఖ నిదర్శనం. పేజీ నెంబర్:3 లోని పేరాగ్రాఫ్: సీ లో ఈ వివరాలు ఉన్నాయి. 17వ కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ మీటింగ్ లోను గత ప్రభుత్వం ప్రాజెక్టులను అప్పగించేందుకు ఒప్పుకోలేదన్న విషయాన్ని రాహుల్ బొజ్జా రాశారని" హరీష్ రావు పేర్కొన్నారు. అంతేకాదు నీటి వాటాల పంపకంపై 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తాము కేంద్రానికి 26 లేఖలు రాశామని హరీష్ రావు శాసనసభలో వెల్లడించారు.హరీష్ రావు మాట్లాడిన అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆయనదైన స్పందన వినిపించారు.." 2014బి22 సంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు 512 టీఎంసీల నీరు ఇచ్చేందుకు ఒప్పుకుంది. గత సంవత్సరం నుంచి మాత్రమే 50:50 నిష్పత్తిలో వాటా అడుగుతోంది. అంతేకాదు ఎన్నికలకు ముందు ఏపీ ప్రభుత్వ పోలీసులు నాగార్జునసాగర్ ప్రాజెక్టు మీదికి వచ్చి హంగామా సృష్టించారు. దీనిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు భారత రాష్ట్ర సమితి ప్రయత్నించింది. ఇప్పుడు అధికారంతో పోగానే కృష్ణా నిర్మించిన ప్రాజెక్టుల విషయంలో అనవసరమైన హంగామా చేస్తున్నది. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తోంది" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించలేదని నీటిపారుదల శాఖ మంత్రిగా తాను చెబుతుంటే.. హరీష్ రావు అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు.మరోవైపు ఈ వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో స్పందించారు.. తెలంగాణకు కృష్ణా నది నీళు ప్రాణప్రదమని అన్నారు. ఎట్టి పరిస్థితిలో కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించబోమని స్పష్టం చేశారు. కృష్ణా నది నీళ్లపై చర్చ జరుగుతున్నప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రాలేదని ప్రశ్నించారు..కృష్ణా నది నీళ్లపై తెలంగాణకు 68 శాతం



వాటా ఇవ్వాలని ప్రభుత్వం తీర్మానం పెడుతుంటే.. దానిని ఆమోదించకుండా.. సభకు రాకుండా.. వ్యవసాయ క్షేత్రంలో పడుకున్నారని కెసిఆర్ పై తీవ్ర విమర్శలు చేశారు. అంతేకాదు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సభలో ప్రవేశపెట్టిన "551 టీఎంసీల నీరు తెలంగాణకు రావాలి" అనే తీర్మానానికి కెసిఆర్ అనుకూలమా? కాదా? అనే విషయాన్ని తేల్చాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.ఇక రేవంత్ రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు స్పందించారు. జనవరి 17 2024న కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు మీటింగ్ జరిగిందని.. కృష్ణ నదిపై నిర్మించిన ప్రాజెక్టులు కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని.. తెలంగాణకు అన్యాయం జరుగుతోందని.. వంటి విషయాలపై పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని హరీష్ రావు అన్నారు. ఈ వ్యవహారంపై తాము ఆందోళనలు చేస్తే ప్రభుత్వం అప్పుడు మేల్కొందని.. జనవరి 27 2024న ప్రస్తుత ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందన్నారు. అయితే ఆ లేఖలో మాత్రమే కేంద్రానికి ప్రాజెక్టులు అప్పగించడం లేదని ఉందన్నారు. ఇక ఫిబ్రవరి 1 2024న జరిగిన రెండవ సమావేశంలో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ కు అప్పగించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందని హరీష్ రావు అన్నారు

# స్థానిక వార్తలు

## పంటలను సస్యరక్షణతో కాపాడుకోవాలి

**ముధోల్ మండల ఏవో భాస్కర్**



**వాస్తవ నేస్తం,ముధోల్:** మండల కేంద్రమైన ముధోల్ లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి భాస్కర్, ఏఈఓ ప్రవీణ్ కుమార్ గోధుమ, మొక్కజొన్న, కుసుమ పంట పొలాలను పరిశీలించారు. పంటలకు పురుగులను తొలి దశలోనే గుర్తించి నివారణ చేపట్టాలని రైతులకు సూచించారు. చీడపీడలు, అగ్గి తెగుళ్ల వ్యవసాయ అధికారికి చూపించి ఎలాంటి పిచికారి ముందు వాడలో తెలుసుకోవాలన్నారు. గోధుమ, వరి, మొక్కజొన్న, జోన్న, కుసుమ తో పాటు వేరుశనగ కందులు పంటలపై ఆశించే పురుగులు నివారణకు తగు జాగ్రత్తలు తీసుకొని సలహా సూచన పాటించాలన్నారు. వ్యవసాయ అధికారుల ఆదేశాల మేరకే క్రిమిసంహారక మందులు వాడాలని రైతులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతుల మల్లేష్, నాగేష, ప్రేమదాస్, బొగ్గులోల్ల సాయినాథ్, గంగా సింగ్, ప్రకాష్, సాయినాథ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు




**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేజీబీవీ, సిఆర్టి లను రెగులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపే చెల్లించాలని అన్నారు. చేస్తున్నాము. అదేవిధంగా టెట్ ను ఎక్సంప్షన్ ఇచ్చి వెంటనే ప్రమోషన్ లు చేపట్టాలని డిమాండ్ చేశారు. అస్సాంతో పాటు వివిధ రాష్ట్రాల్లో అమలుచేస్తున్నట్టు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పుట్ట రవి కిరణ్, బిక్క రమేష్, మండలాధ్యక్షులు పైడిపల్లి భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

## భారత్ పురస్కారానికి ఎంపికైన ఉపాధ్యాయుడు



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్యాణీ సకల కళావేదిక వారి అధ్వర్యంలో ప్రదానం చేసే జాతీయ స్థాయి జై భారత్ పురస్కారం-2024 నకు, జిల్లాలోని సదాశివపేట మండలం లోని నిజాంపూర్(కె) ప్రాథమిక పాటశాలలో ఉపాధ్యాయుడు గా పనిచేయుచున్న పోట్రు రామకృష్ణ ఎంపికైనట్లు ఆర్వాణి సకల కళావేదిక చైర్మన్ దూడపాక శ్రీధర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు రామకృష్ణ కు ఆహ్వానం అందించారు. విద్యాబోధన, పాటశాలల అభివృధి, పత్రికలకు వ్యాసాలు రాయుట, సామాజిక సేవారంగాలలో రామకృష్ణ చేస్తున్న విశిష్ట సేవలకు గాను ఈ అవార్డ్ కు ఎంపిక చేసినట్లు శ్రీధర్ తెలియ చేశారు. రామకృష్ణ జాతీయ స్థాయి జై భారత్ పురస్కారం 2024 తో పాటు ఉపాధ్యాయ రత్న బిరుదు, స్వర్ణ కంకణంను మార్చ్ 10 న కరీంనగర్ లోని ఫిల్మ్ భవన్ లో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా స్వీకరిస్తానని శ్రీధర్ తెలియజేశారు. జై భారత్ అవార్డ్- 2024 తనను ఎంపిక చేసినందుకు కమిటీ సభ్యులకు రామకృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు.

## వైద్య వృత్తి అత్యంత ఉన్నతమైనది

**వైద్య విద్యార్థులు మంచి డాక్టర్లుగా ఎదిగి ప్రజలకు సేవలు అందించాలి**

**జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** జిల్లాలోని మెడికల్ కళాశాల పనులను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. మెడికల్ కళాశాల రెండో బ్లాక్ లో నిర్మాణంలో ఉన్న కొత్త హాస్టల్ భవనాలు, పరిపాలన భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆయా భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి స్వాధీనం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. అదేవిధంగా మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కాంపౌండ్ వాల్ పూర్తి చేయాలని చెప్పారు. మెడికల్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ వృత్తి గౌరవ ప్రదమైనదని, విద్యార్థులకు సబ్జెక్టుపై పూర్తి నాలెడ్జ్ ఉన్నప్పుడే, రాబోయే రోజుల్లో డాక్టరుగా రోగుల ఆరోగ్య సమస్యలను పరిష్కరించ గలుగుతారని, అందుకు బాగా చదివి,మంచి డాక్టర్లుగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి ఆస్పత్రి మొత్తం కలియ తిరిగి పరిశీలించారు. అన్నివార్డులను, ఆపరేషన్ లను పరిశీలించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. డయాలసిస్ సెంటర్లో నమోదైన పేషెంట్ వివరాలు పరిశీలించారు. నవజాత శిశువుల తల్లులతో కలెక్టర్ మాట్లాడుతూ . బిడ్డ పుట్టిన వెంటనే పాలు పట్టారా అంటూ అడిగారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు పట్టాలని,తల్లి పాలతో పిల్లలలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. అనంతరం ఆసుపత్రికి ఇంకా ఏమైనా ఎక్విప్మెంట్ అవసరం ఉన్నట్లయితే ఆయా వివరాలతో ప్రతిపాదనలను అందించినట్లయితే మంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని కలెక్టర్ ఆసుపత్రి సూపర్డెంట్ కు సూచించారు. కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, ఆర్.అండ్.బి అధికారులు, తహాశీల్దార్, తదితరులు ఉన్నారు.

# మల్లారెడ్డి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం






**వాస్తవ నేస్తం,కుత్బుల్లాపూర్:** నిజాంపేట్ 32వ డివిజన్ పరిధిలో రాజీవ్ గాంధీ నగర్ తెలుగు తల్లి విగ్రహం వద్ద మల్లారెడ్డి సేవ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మెన్ డా.చామకూర భద్రా రెడ్డి తో కలిసి పాల్గొన్న మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన మల్లారెడ్డి సేవా ట్రస్ట్ వారికి హాస్పిటల్ యాజమాన్య సిబ్బందికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, ఉచిత వైద్య పరీక్షలను, మందులను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, కోలన్ వీరేందర్ రెడ్డి, ఎన్ఎంసి బిఆర్ఎస్ బీసీ సెల్ జెనరల్ సెక్రెటరీ దశరథ్, స్థానిక రాజీవ్ గృహకల్ప 31, 32, 33 డివిజన్ల అధ్యక్షులు బిక్షపతి, అశోక్, ముత్యాలు, మహిళా నాయకులు స్వర్ణ కుమారి, నర్మద, సుకన్య, యువ నాయకులు తొంట చందు, నాయక్, ఆర్ జి కే నాయకులు, కాలనీ వాసులు, ఇతర ముఖ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయండి

**అఖిల పక్ష రాజకీయ, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు**



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల కేంద్రంలోబిజేపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్ చేయాలని అఖిల పక్ష రాజకీయ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిఐటియూ కార్యాలయంలో సిఐటీయూ మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు అధ్యక్షతన అఖిల పక్ష రాజకీయ, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష రాజకీయ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు చింతలచెర్వు కోటేశ్వరావు, గాలి దుర్గారావు, దొండపాటి నాగేశ్వరావు, యంగల ఆనందరావు, రావుట్ల సత్యనారాయణ, బంధం శ్రీనివాసరావు, బంధం నాగేశ్వరావులు మాట్లాడుతూ.. భారత దేశానికి స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాల పాలనలో కార్మిక వర్గ హక్కులను కాలరాసేవిధంగా బహిరంగంగానే కార్మిక చట్టాలను మార్చేసి, కార్మికులను కట్టు బానిసలుగా మార్చిన ఘనత నరేంద్రమోడికే దక్కుంతుందన్నారు. కార్మిక కనీస వేతనం రూ.25 ఇవ్వాలని ఉద్యమాలు, పోరాటాలు చేస్తుంటే, ఒక్క రోజుకు రూ.175 మోదీ చెప్పుతునే, మరో పక్క సంవత్సరంలో ఆదానీ, అంబానీలకు కేంద్రం ప్రభుత్వం రూ.24 వేల కోట్లను బ్యాంకు రుణాలను మాఫీ చేయడమే కాక కార్పోరేట్లను పనులను పెద్ద ఎత్తున్న తగ్గించిందన్నారు. ఎటువంటి సామాజిక భద్రత లేకుండా కార్మికులు పనిచేస్తున్నారని, ఫిక్సడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ను తెచ్చిన మోదీ ప్రభుత్వం యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, యాజమాన్యం వారికి వారే సెల్ఫ్ సర్టిపికెట్స్ ఇచ్చే కొత్త పద్ధతిని పట్టుకువచ్చారాన్నారు. మహిళ కార్మికులకు టాయిలెట్ సౌకర్యం, మెటర్నిటీ సెలవు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. అత్యంత దుర్భర పరిస్థితులలో పని ప్రాంతాలలో కార్మికులు పనిచేస్తున్నారని, ఇది వారి రోజు జీవనాన్ని ప్రభవితం చేస్తుందన్నారు. కార్మిక సమస్యలపై ఈ కాలంలో దేశమంతా పోరాటాలు, ఉద్యమాలు అటుడుగుతుంటే రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేల్ తీసుకుని వాయించినట్లుగా మోడీ వైఖరి ఉందని విమర్శించారు. గత పది సంవత్సరాల కాలం లో మోదీ విధానాల వల్ల వచ్చిన అసంతృప్తిని పోరాటాల వైపుకు రానివ్వకుండా మతాల పేరుతో పబ్బం గడుపు కుంటాన్నరన్నారు. అఖిల పక్షాల ఆధ్వర్యంలో జరిగే ఫిబ్రవరి 16 సమ్మెను స్వచ్ఛంధంగా ప్రతి ఒక్కరూ పాల్గొని జయ ప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బోళ్ల ప్రసాదరావు, మండేపూడి గోర్కి, గవీదు సైదులు, బూర్గుల అప్పారావు, ఉదారపు నాగేశ్వరావు, గారపాటి వెంకటేశ్వర రావు, భద్రునాయక్, ఆకెన పవన్తోదితరులు పాల్గొన్నారు.

# తరోడ లో కన్నుల పండువగా ఊరు పండుగ





**బోనమెత్తిన ఆడపడుచులు**

**ప్రత్యేక ఆకర్షణగా పోతరాజుల విన్యాసాలు**


**వాస్తవ నేస్తం,ముధోల్:** ముధోల్ మండలంలోని తరోడ గ్రామంలో మంగళవారం ఊరు పండుగను గ్రామస్తులు ఆధ్వర్యంలో వైభవంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంప్రదాయ బద్ధంగా గ్రామస్తులు గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు బాగాపండి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

# రితికా సింగ్ ‘వళరి’ స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్..



అటు థియేటర్స్.. ఇటు ఓటీటీలో ల జాతర మొదలైంది. గత శుక్రవారం ఈగల్, లాల్ లు విడుదలై సూపర్ హిట్ టాక్ అందుకున్నాయి. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలు థియేటర్లలో భారీ వసూళ్లు రాబడుతూ దూసుకుపోతున్నాయి.మరోవైపు ఓటీటీలోనూ థ్రిల్లింగ్ సస్పెన్స్ మూవీస్ రిలీజ్ అయి మంచి రెస్పాన్స్ అందుకుంటున్నాయి. ఇక ఇప్పుడు ఓటీటీలోకి మరో హారర్ మూవీ రాబోతుంది. అదే ‘వళరి’. గురు తో తెలుగు తెరకు పరిచయమైన హీరోయిన్ రితికా సింగ్. ఇందులో వెంకీ సరసన నటించి మెప్పించింది. ఆ తర్వాత తెలుగులో పలు చిత్రాల్లో కనిపించింది. ఇక ఇప్పుడు హారర్ తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు రెడీ అయ్యింది. ఈ చిత్రానికి మ్రితికా సంతోషిణి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ తోనే రైటర్ మ్రితికా దర్శకురాలిగా పరిచయం కాబోతున్నారు. ఇందులో శ్రీరామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. అలాగే ఉత్తేజ్, సుబ్బరాజు, నవీన్ నాయుడు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఔట్ అంట్ ఔట్ హారర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ మూవీలో రితికా సింగ్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. అయితే ఈ ను థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలోనే రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మూవీని ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ ఈటీవీ విన్ లో మార్చి 6 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ క్రమంలోనే రితికా సింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేసింది చిత్రయూనిట్. అందులో రితికా సింగ్ వెనక దయ్యం రూపంలో మరో అమ్మాయి కనిపించడం పై ఆసక్తిని కలిగిస్తోంది. 2018లో విడుదలైన నీవెవరో తర్వాత రితికా మరో మూవీలో కనిపించలేదు..కానీ తమిళంలో పలు చిత్రాల్లో నటించింది. దాదాపు ఆరేళ్ల గ్యాప్ తర్వాత ఇప్పుడు మళ్లీ వళరి తో తెలుగులోకి రీఎంట్రీ ఇస్తుంది.

# బన్నీతో ఎప్పటికైనా చేస్తా..!



ఫిక్షనల్ స్టోరీస్ తో ఆడియన్స్ కి థ్రిల్లర్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వడంలో వి ఐ ఆనంద్ స్టైల్ వేరు. ఎక్కడికిపోతావు చిన్న వాడా, ఒక్క క్షణం సినిమాలతో ఆయన తన మార్క్ చూపించారు.అయితే రవితేజతో డిస్కో రాజా రిజల్ట్ తేడా కొట్టడంతో కొద్దిపాటి గ్యాప్ ఇచ్చి ప్రస్తుతం సందీప్ కిషన్ తో ఊరుపేరు భైరవ కోన సినిమాతో వస్తున్నారు. ఈ సినిమా తో తన హిట్ టార్గెట్ రీచ్ అవుతాననే నమ్మకం బలంగా ఉందని చెబుతున్నారు వి ఐ ఆనంద్. ఇదిలాఉంటే టైగర్ సినిమా తో సందీప్ తో పనిచేసిన వి ఐ ఆనంద్ మరోసారి ఇద్దరు కలిసి ఈ సినిమా చేయడం ఆడియన్స్ ని సినిమాపై అంచనాలు పెంచుకునేలా చేసింది.అయితే యువ హీరోలతోనే కాదు స్టార్ హీరోలను కూడా డైరెక్ట్ చేస్తా అంటున్నాడు వి ఐ ఆనంద్. టైగర్ సినిమా టైం లో అల్లు అర్జున్ తో కథా చర్చలు జరిగాయని అయితే ఆ టైం లో బన్నీ లార్జర్ ద్యాన్ లైఫ్ స్టోరీస్ కావాలని అడిగారని రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పారు వి ఐ ఆనంద్. అయితే ఎప్పటికైనా అల్లు అర్జున్ తో సినిమా చేస్తానని అంటున్నారు ఈ డైరెక్టర్. అల్లు అర్జున్ కి ఇప్పుడున్న టైం లో కథ చెప్పి ఒప్పించడం అనేది పెద్ద టాస్క్. పుష్ప తో పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న అల్లు అర్జున్ ని మెప్పించే కథ రెడీ చేస్తే మాత్రం ఆనంద్ దశ తిరిగినట్టే. ఇక ఊరు పేరు భైరవ కోన సినిమా టీజర్, ట్రైలర్ ఇంప్రెస్ చేశాయి. సినిమా తప్పకుండా బాగానే వర్క్ అవుట్ అవుతుందని అంటున్నారు. మరి ఈ సినిమా హిట్ కొడితే అయినా అల్లు అర్జున్ దృష్టిలో పడతాడేమో చూడాలి. అల్లు అర్జున్ ఛాన్స్ కోసం ఇప్పుడు తానొక అద్భుతమైన కథ రెడీ చేస్తా అంటున్నారు వి ఐ ఆనంద్.



# ఎయిర్ఫోర్స్ పైలట్ తాన్య శర్మ

వరుణ్ తేజ్ బాలీవుడ్లోకి ఎంట్రీ ఇస్తూ నటిస్తున్న ప్రాజెక్ట్ ‘ఆపరేషన్ వాలెంటైన్’. ఎడ్జ్ ఆఫ్ ది సీట్ యాక్షన్ థ్రిల్లర్గా ఈ సినిమా ఇప్పటికే గ్రిప్పింగ్ టీజర్, వందేమాతరం, గగనాల చార్ట్ బస్టర్ సాంగ్స్తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఐఏఎఫ్ ఆఫీసర్గా నటిస్తుండగా, మానుషి చిల్లర్ రాడార్ ఆఫీసర్గా కనిపించనుంది. రుహాని శర్మ కూడా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తోంది. తాజాగా మేకర్స్ రుహాని శర్మను తాన్య శర్మగా పరిచయం చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్లో ఎయిర్ ఫోర్స్ పైలెట్ యూని ఫాంలో డైనమిక్గా కనిపించింది రుహాని శర్మ. ఈ చిత్రం దేశంలోని వైమానిక దళ వీరుల అలుపెరగని పోరాటాన్ని, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొనే సవాళ్లను అద్భుతంగా చూపించ బోతుంది. ఈ చిత్రానికి శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించారు. వరుణ్తేజ్ కెరీర్లోనే ది బెస్ట్ మూవీగా ఇది నిలుస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేశారు. దేశభక్తి స్ఫూర్తిని కలిగించే ఈసినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందంటున్నారు. ఇందులోని ప్రతి పాత్ర ప్రేక్షకుల మనసుల్ని తాకుతుందని, మంచి కంటెంట్తో ఉన్న ఇలాంటి సినిమాని నిర్మించడం గర్వంగా ఉందన్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ నిర్మించారు, గాడ్ బ్లెస్ ఎంటర్టైన్మెంట్ (వకీల్ ఖాన్), నందకుమార్ అబ్బినేని సహ నిర్మాతలు. మార్చి 1న తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



# యానిమల్ నాకు తెగ నచ్చేసింది

బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషీ గురించి పెద్దగా పరిచయం అక్కర్లేదు. గ్యాంగ్ ఆఫ్ వాస్సేపూర్ సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్గా గుర్తింపు తెచ్చుకుంది. అయితే తాజాగా ఈ భామ యానిమల్ సినిమాపై ప్రశంసల వర్షం కురిపించింది. యానిమల్ సినిమాపై హ్యూమా ఖురేషీ మాట్లాడుతూ.. ఈ సినిమా నాకు చాలా నచ్చింది. ఈ సినిమాలో యాక్షన్, మ్యూజిక్ అన్నీ బాగున్నాయి. ఇలాంటి సినిమాలో తాను కూడా నటించాలని అనుకుంటున్నా. ఒక నటిగా అన్ని రకాల సినిమాలు చేయాలి. అయితే ఆ సినిమాలు చూడాలా వద్దా అనేది ప్రేక్షకుల ఇష్టం. సినిమా అన్నాక ప్రశంసలతో పాటు విమర్శలు కూడా వస్తుంటాయి. అంటూ హ్యూమా చెప్పుకొచ్చింది. కాగా ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ నటుడు రణ్బీర్ కపూర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. ఇప్పటివరకు బాక్సాఫీస్ వద్ద రూ.900 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమాపై పలువురు విమర్శలు గుప్పించారు. ఈ సినిమాలో మహిళలను అభ్యంతరకరంగా చూపించారనే ఆరోపణలు కూడా వచ్చాయి.

**Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com**